

## కౌంటింగ్ కేంద్రానికి పోస్టల్ బ్యాలెట్ బాక్సులు

**నెల్లూరు(హరనాథపురం) :** పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కూడిన బాక్సులను ప్రియదర్శిని కళాశాల స్ట్రాంగ్ రూములకు చేర్చారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో భద్రపరచిన ఈ బాక్సులను సోమవారం తరలించారు. ఆర్వోలు, ఏఆర్వోల సమక్షంలో బందోబస్తు నడుమ ఈ కార్యక్రమం జరిగింది. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి కలెక్టరేట్‌లో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను కూడా డీఆర్వో లవన్న సమక్షంలో ప్రియదర్శిని కళాశాలకు చేర్చి భద్రపరిచారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

# ఓటరు మెచ్చిన రాజెవరో!?

- నేడే ఓట్ల లెక్కింపు.. అభ్యర్థుల్లో ఎడతెగని ఉత్కంఠ
- మధ్యాహ్నం 2 గంటలకు తొలి ఫలితం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- ఖరీదైన ఎన్నికల్లో ప్రజా తీర్పు ఎటు?
- ఎన్డీయే కూటమికే జై కొట్టారా!?
- ఫ్యాన్ గాలి ఎటువైపు వీచింది!?


*లబ్ డబ్.. లబ్ డబ్...*

*గడియారం కన్నా గుండె వేగం ఎక్కువగా కొట్టుకుంటోంది.*

*కొన్ని గంటలు.. కాదు కాదు... కొన్ని నిమిషాలు.. సెకన్లు*

*అవును.. ఇరవై రోజుల నిరీక్షణకు ఇంకొన్ని గంటల్లో తెరపడనుంది. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉన్న ఈవీఎంలు తెరుచుకుని తీర్పు వెల్లడయ్యేందుకు ఇంకా కొన్ని నిమిషాలే ఉన్నాయి.*

ఐదేళ్ల అంచనాలు.. 60 రోజుల హోరాహోరీ ప్రచారాలు.. గెలుపు కోసం వెదజల్లిన రూ.వేల కోట్ల ప్రభావం.. మీట నొక్కిన తరువాత ఓటు రూటు ఎటువైపో తెలుసుకోవడం కోసం మూడు వారాల నిరీక్షణ.. వీటన్నిటికీ సమధానం మంగళవారం దొరకనుంది. సాయంత్రం 3 గంటలకల్లా విజేతలెవరో.. పరాజితులెవరో తేలిపోనుంది. ఐదేళ్ల జగన్ పాలనకు జనం జై కొట్టారా!? ఇక చాలు పొమ్మంటూ తిరస్కరించారా!? బట్టబయలు కానుంది. ఎన్డీఏ కూటమికి అనుకూలంగా వచ్చిన మెజారిటీ ఎగ్జిట్‌పోల్స్‌లో నిజమెంత!?.. రాష్ట్రానికి టీడీపీ అధినేత చంద్రబాబు అవసరమని భావించిన ప్రజలెందరో లెక్క తేలిపోనుంది. తరతరాలుగా జిల్లా రాజకీయాలపై ఆధిపత్యం సాధిస్తూ వచ్చిన పలువురు పెద్దారెడ్ల భవిత్యం ఎలా ఉండబోతుందో నేటి ఫలితాలతో తేలిపోతుంది. 20 రోజుల పాటు అభ్యర్థుల గెలుపోటముల పై ప్రజలను వెన్నాడిన ఉత్కంఠకు తెరపడనుంది. జిల్లావాసులు ఎవరికి జై కొట్టారో.. రానున్న ఐదేళ్ల కాలానికి ఎవరిని రాజును చేశారో!? ఎవరిని పరాజితులను చేసి ఇళ్లకు పంపారు నేటి ప్రజాతీర్పుతో తేటతెల్లం కానుంది.





ఓట్ల లెక్కింపు సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

**నెల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) :** పోలింగ్ అనంతరం దొరికిన 20 రోజుల విరామంతో విశ్రాంతి జీవనంలోకి వెళ్లిన ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఆఖరు టెన్షన్ మొదలయ్యింది. సోమవారం ప్రతి నాయకుడి ఇంటి వద్ద సందడి కనిపించింది. కౌంటింగ్ ఏజెంట్ల హడావుడితో ప్రధాన పార్టీల అభ్యర్థుల నివాసాల వద్ద పండుగ వాతావరణం నెలకొన్నా, పోటీదారుల్లో మాత్రం నరాలు తెగే ఉత్కంఠ కనిపించింది. ఎగ్జిట్‌పోల్స్ ప్రభావంతో కూటమి సభ్యుల్లో ఉత్సాహం కనిపించినా అసలు ఫలితాలపై మాత్రం టెన్షన్ కనిపించింది. పీత కష్టాలు పీతవి అన్నట్టుగా బెట్టింగ్ రాయుళ్లు ఇంకా ఎక్కువ టెన్షన్ పడిపోతున్నారు. కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో వీరి గుండె వేగం పెరుగు తోంది. తాము కాచిన పందెం ఏమవుతుందోననే టెన్షన్‌తో ఎత్తిన మొబైల్‌ను దించకుండా నిరవధికంగా ఎగ్జిట్ పోల్స్‌ను చూస్తూ తమలో తామే మాట్లాడుకొంటూ టెన్షన్‌గా కనిపిస్తున్నారు.

**● విధుల్లో 3,600 మంది**

ఓట్ల లెక్కింపు సిబ్బంది ఉదయం 5 గంటల కల్లా కౌంటింగ్ కేంద్రమైన ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకుంటారు. నియోజకవర్గాల వారీగా ఈవీఎం యంత్రాలను వారికి కేటాయించిన కౌంటింగ్ గదుల్లో కి చేరుస్తారు. ఏజెంట్ల సమక్షంలో సరిగ్గా ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఈ ప్రక్రియలో ప్రత్యక్షంగా 1,100 మంది, పరోక్షంగా మరో 2,500 మంది సిబ్బంది విధుల్లో ఉంటారు.

**అందరి దృష్టి జిల్లాపైనే!**

నెల్లూరు రాజకీయాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉంది. రాష్ట్ర రాజకీయాలను శాసించిన రాజకీయ కుటుంబాలు జిల్లాలో చాలానే ఉన్నాయి. ఆ క్రమంలోనే ఈ జిల్లా రాజకీయాల పట్ల రాష్ట్రస్థాయిలో ఆసక్తి కనబడు తోంది. ఈ ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీల నుంచి పెద్ద రాజకీయ కుటుంబాలు, బడా పారిశ్రామికవేత్తలు పోటీ పడటంతో ఫలితాల పట్ల మరింత ఆసక్తి పెరిగింది. ఆనం, మేకపాటి, సోమిరెడ్డి, నేదురుమల్లి, నల్లపరెడ్డి, ఆదాల, కోటంరెడ్డి కుటుంబాలు ఈ ఎన్నికల్లో పోటీ చేశాయి. అలాగే బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలు పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దం పతులు, వైసీపీలో నెంబర్ టుగా చక్రం తిప్పిన విజయ సాయిరెడ్డి, రాజకీయ చిత్రపటంలోకి కొత్తగా దూసుకొ చ్చిన బడా కాంట్రాక్టర్లు, ఎన్ఆర్ఐలు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వర రావులు పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాలే ఈ నేతల భవిష్యత్తును నిర్ణయించనుండటంతో జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా నెల్లూరు జిల్లా ఫలితాలపై ఆసక్తి కనబడుతోంది.

**● తొలుత పోస్టల్ బ్యాలెట్**

కౌంటింగ్‌లో తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. నెల్లూరు పార్లమెంట్ సెగ్మెంట్‌కు 23,976 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 25,846 ఓట్లు పోల్ అయ్యాయి. వీటిలో సర్వీస్ ఓట్లు 24,223 కాగా, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధుల ఓట్లు, 870, పీడబ్ల్యూడీ ఓట్లు 753 పోల్ అయ్యాయి. నియోజకవర్గాల వారీగా గమనిస్తే నెల్లూరు రూరల్‌లో అత్యధికంగా 5405 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా సర్వేపల్లిలో అత్యల్పంగా 1878 ఓట్లు పోల్ అయ్యాయి. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఇందుకోసం ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేశారు. 20 నిమిషాల్లో ఈ ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఆ తరువాత ఈవీఎం ఓట్ల లెక్కింపు మొదలు పెడతారు.

**● మధ్యాహ్నం 2 గంటలకల్లా తొలి ఫలితం**

ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. జిల్లా పరిధిలో ఈవీఎంల ద్వారా మొత్తం 15,48,183 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో అత్యధికంగా 79.63 శాతం పోలింగ్ జరిగింది. నియోజకవర్గాల్లో కందుకూరు నియోజకవర్గంలో అత్యధికంగా 88.96 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కావలి, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో 83 పైచిలుకు శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నెల్లూరు రూరల్ నుంచి అత్యల్పంగా 67.76 శాతం మంది ఓటు హక్కు వినిగించుకున్నారు. నెల్లూరు సిటీ 71.72, కోవూరు 79.29, ఉదయగిరి 81.92 శాతం ఓటింగ్ జరిగింది. ప్రతి 20 నిమిషాలకు ఒక రౌండ్ పూర్తి చేస్తారు. ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాల్లో అత్యధికంగా 24 రౌండ్ల లెక్కింపు జరిగితే నెల్లూరు సిటీలో అత్యల్పంగా 18 రౌండ్లకే తుది ఫలితాలు వెల్లడి అవుతాయి. అభ్యంతరాలు, వివాదాలు లేని పక్షంలో నెల్లూరు జిల్లాలో తొలి ఫలితం నెల్లూరు సిటీదే కానుంది. ఉదయగిరి, కోవూరు ఫలితాలు కాస్త ఆలస్యంగా సాయంత్రం 4 గంటలకు వెలువడే అవకాశం ఉంది. నెల్లూరు పార్లమెంట్ తుది ఫలితాలు వెలువడే సరికి సాయంత్రం 6 గంటల సమయం పడుతుంది. ఈ ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. నాలుగు రౌండ్లలో పూర్తి చేస్తారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 2వేల మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

| నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | పోస్టల్ బ్యాలెట్ ఓట్లు | అభ్యర్థులు | రౌండ్లు | తొలి ఫలితం వెలువడేది? |
|---|---|---|---|---|---|---|
| నెల్లూరు సిటీ | 2,39,497 | 1,71,763 | 3,071 | 15 | 18 | మధ్యాహ్నం 2 గం.. |
| నెల్లూరు రూరల్ | 2,80,888 | 1,90,324 | 5,405 | 11 | 21 | మధ్యాహ్నం 3 గం.. |
| కోవూరు | 2,67,403 | 2,11,976 | 3,210 | 13 | 24 | సాయంత్రం 4 గం.. |
| కావలి | 2,38,553 | 1,98,066 | 3,635 | 13 | 23 | సాయంత్రం 4 గం.. |
| కందుకూరు | 2,28,979 | 2,03,637 | 2,689 | 22 | 20 | మధ్యాహ్నం 3 గం.. |
| ఆత్మకూరు | 2,15,401 | 1,79,829 | 3,131 | 13 | 20 | మధ్యాహ్నం 3 గం.. |
| ఉదయగిరి | 2,41,861 | 1,97,970 | 2,827 | 15 | 21 | సాయంత్రం 4 గం.. |
| సర్వేపల్లి | 2,32,011 | 1,94,618 | 1,878 | 13 | 21 | మధ్యాహ్నం 3 గం.. |

**ఏర్పాట్లు ఎలా ఉన్నాయ్!**


కౌంటింగ్ కేంద్రం వద్ద కలెక్టర్, ఎస్పీ ఆరా


పోస్టల్ బ్యాలెట్ ఓట్లున్న పెట్టెలను తరలిస్తూ..


ఓట్ల లెక్కింపు సిబ్బంది కోసం కమ్మనైన వంటలు తయారు చేస్తున్న సిబ్బంది


బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు

## మూడంచెల భద్రత

- జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 యాక్ట్ అమలు
- రాజకీయ పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద భద్రత

### బందోబస్తు విధుల్లో 2వేల మందికిపైగా పోలీసులు

**నెల్లూరు (క్రైం) :** ఓట్ల లెక్కిపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆధ్వర్యంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద సుమారు 2వేల మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. బందోబస్తుపై సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో అధికారులు, సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయడంతో పాటు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్‌ను అమలు చేశారు. అభ్యర్థుల ఇళ్లు, పార్టీ కార్యాలయాల వద్ద భద్రత ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరిస్తున్నారు. డ్రైడేను 5వ తేదీ ఉదయం వరకు నిక్కచ్చిగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా రెండు రోజుల పాటు నాకా బందీతోపాటు లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించినా, గైర్హాజరు అయినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**● నిఘా నీడలో...**

ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో సీసీ కెమెరాలతో పాటు వీడియో గ్రాఫర్‌ను నియమించి ప్రతి అంశం రికార్డు అయ్యేలా చర్యలు చేపట్టారు. ప్రధాన గేట్లు వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు ఇలా ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే లోనికి అనుమతిస్తారు. కేంద్రబలగాలు, ఏపీఎస్పీతోపాటు స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా 300లకుపైగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా ఉంచారు. జిల్లా ప్రధాన కేంద్రంలోని కూడళ్లలో పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌ను ఇప్పటికే బైండోవర్లు చేయగా, భద్రత దృష్ట్యా సోమవారం పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది.

**ట్రాఫిక్ ఆంక్షలు**

కౌంటింగ్ సందర్భంగా మంగళవారం నెల్లూరు నగరం, రూరల్ పరిదిలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

- గొలగమూడి దేవాలయానికి వెళ్లే భక్తులు కాకుటూరు జాతీయ రహదారి మీదుగా వెళ్లాలి.
- గూడురు నుంచి నెల్లూరు నగరంలోకి వచ్చే ప్రయాణికులు అయ్యప్పగుడి మీదుగా వెళ్ళాలి.
- కావలి వైపు నుంచి వస్తూ నెల్లూరు నగరంలోకి వెళ్లే ప్రయాణికులు చింతారెడ్డిపాలెం జంక్షన్ చిల్డ్రన్స్ పార్కు మీదుగా వెళ్లాలి.
- హైవేపై దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు, లారీలకు ఎలాంటి ఆంక్షలు లేవు.
- మినీబైపాస్ నుంచి కొండాయపాలెం మీదుగా నేషనల్ హైవేపైకి అనుమతి లేదు.
- కౌంటింగ్‌కు వచ్చే నాయకులు, ఏజెంట్ల వాహనాలకు కనుపర్తిపాడు జడ్పీ హైస్కూల్‌లో, ద్విచక్ర వాహనాలకు స్కూలు పడమర వైపు ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.


పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ

**ఏజెంట్లకు సూచనలు**

- కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే ఏజెంట్లు అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలి.
- మొబైల్స్ ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు, అగ్గిపెట్టెలు, సిగిరెట్లు, పెన్, పేపర్ వంటి వాటిని అనుమతించరు.
- ఏజెంట్లు ఒకసారి కౌంటింగ్ కేంద్రం లోపలికి వెళ్లిన తర్వాత కౌంటింగ్ పూర్తయ్యేవరకు బయటకు రాకూడదు.
- అనారోగ్య సమస్యలు ఉంటే ముందుగానే మందులు వెంట తెచ్చుకోవాలి.
- ఫలితాలు వెలువడిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, డీజే సౌండ్స్, బాణాసంచా కాల్చడానికి అనుమతి లేదు.

## రౌండ్ల వారీ ఫలితాలు ఆలస్యం లేకుండా ప్రకటించాలి

**కౌంటింగ్ అబ్జర్వర్ నితిన్ సింగ్ బదారియా**

**నెల్లూరు (హరనాథపురం), జూన్ 3 :** ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి రౌండ్లవారీ ఫలితాలను ఆలస్యం లేకుండా ప్రకటించాలని కౌంటింగ్ పరిశీలకుడు నితిన్ సింగ్ బదారియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన రిటర్నింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బదారియా మాట్లాడుతూ ఎటువంటి కారణాలు లేకుండా ఓట్ల లెక్కింపు ఆలస్యం కాకుడదని స్పష్టం చేశారు. మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు రౌండ్ల వారీగా ఫలితాలు ప్రకటించేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ ప్రారంబానికి ముందు ఏజెంట్లకు ఓట్ల లెక్కింపు పద్ధతిపై క్లుప్తంగా అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ పేపర్ల స్క్రూటినీలో ఈసీఐ నిబంధనలు పాటించాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు సిటీ, కోవూరు, ఉదయగిరి, రిటర్నింగ్ అధికారులు వికాస్ మర్మత్, సేధుమాధవన్, ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నితిన్ సింగ్ బదారియా, పక్కన కలెక్టర్

**మద్యం దుకాణాల మూత**

**నెల్లూరు(క్రైం) :** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలు, బార్లు మూసివేశారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత 5వ తేదీ బుధవారం ఉదయం మద్యం దుకాణాలు తెరవనున్నారు.

## లారీని ఢీకొన్న కంటైనర్ : డ్రైవర్ మృతి

● ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో మృతిచెందిన డ్రైవర్ తారీఫ్

నెల్లూరు(క్రైం), జూన్ 3: లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించిన కంటైనర్ లారీ వేగంగా అదే లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా క్లీనర్‌తోపాటు మరొకరికి గాయాలయ్యాయి. నెల్లూరు సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. ఢిల్లీ నుంచి చెన్నైకు వెళుతున్న కంటైనర్ లారీ సోమవారం తెల్లవారుజామున కనుపర్తిపాడు క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళుతున్న లారీని ఎడమవైపు నుంచి ఓవర్‌టేక్ చేసే క్రమంలో వేగంగా అదేలారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ తారీఫ్(24)కు తీవ్రగాయాలుకాగా, రాజస్థాన్‌కు చెందిన క్లీనర్ హక్కుముద్దీన్, దిన్‌దార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ డ్రైవర్ తారీఫ్ మృతిచెందాడు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## డిజిటల్ లావాదేవీలతో మందుబాబుల కష్టాలు



మద్యం దుకాణాల వద్ద కొనుగోళ్లకు ఎగబడుతున్న మందుబాబులు

ఉదయగిరి రూరల్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మద్యం విక్రయాల్లో డిజిటల్ లావాదేవీలను అమలు చేయడంతో మందుబాబులకు కష్టాలు తప్పడంలేదు. కొందరు దుకాణాల వద్ద ఫోన్ ద్వారా మద్యం తీసుకెళ్లే వారిని బతిమలాడి వారి ద్వారా ఫోన్ చేయించుకొని మద్యం తీసుకెళుతున్నారు. మద్యం కోసం ఇంత కష్టపడినా దుకాణాల్లో అన్నీ జే బ్రాండ్స్ మాత్రమే విక్రయిస్తున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. మరోవైపు కౌంటింగ్ సందర్భంగా సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి మద్యం దుకాణాలు మూతపడ్డాయి. బుధవారం యథావిధిగా దుకాణాలు తెరుచుకోనున్నాయి. దీంతో సోమవారం మద్యం కోసం మందుబాబులు దుకాణాల వద్ద బారులు తీరారు. ఈ నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలు మందుబాబులను నిరాశకు గురిచేశాయి.

## విడవలూరు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

● పోలీసు ఉన్నతాధికారులకు బాధితురాలి మొర



విలేకరులతో మాట్లాడుతున్న బాధితురాలు మాధవి, దళిత సంఘం నాయకులు

విడవలూరు, జూన్ 3: తమపై దాడి జరిగిందని పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదుచేస్తే కేసు తీసుకోకుండా నానా దుర్భాషలాడిన విడవలూరు ఎస్ఐ రాజుపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన బాధితురాలు మాధవి కోరారు. కోవూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆదివారం అన్నారెడ్డిపాళెం గ్రామంలో ఇంటిలో పుట్టినరోజు వేడుకలకు అదే ప్రాంతానికి చెందిన విగ్నేష్ రాగా ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు, గోపి, యశ్వంత్, వెంకటేశ్వర్లు పాత కక్షలను మనస్సులో పెట్టుకుని విగ్నేష్‌పై దాడికి పాల్పడి కర్రలతో విచక్షణా రహితంగా కొట్టారని, అడ్డుపడిన తనపై దాడిచేసి తన మెడలో ఉన్న గోలును లాగేశారన్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే ఎస్ఐ రాజు కేసు తీసుకోకపోగా కోవూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లమని అక్కడికి వచ్చి ఫిర్యాదు తీసుకుంటామని తెలిపారన్నారు. అయితే ఆసుపత్రికి రాకపోగా దాడి చేసిన వారిలో ఓ వ్యక్తి తన భార్య స్నానం చేస్తుండగా విగ్నేష్ చూశాడని ఫిర్యాదు చేస్తే దానిని స్వీకరించిన ఎస్ఐ మా ఫిర్యాదుని తీసుకోకుండా దాడికి పాల్పడిన వారికి వంత పాడటం ఎంతవరకు న్యాయమని ఆమె ప్రశ్నించింది. ఎస్ఐపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. లేనిపక్షంలో విడవలూరు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకి దిగుతామన్నారు. ఈ విషయంపై ఎస్ఐ రాజుని వివరణ కోరగా.. మాధవి కేసు పెట్టడానికి పోలీసుస్టేషన్‌కి రాలేదని, విషయం తెలుసుకుని కోవూరు ఆసుపత్రి వద్దకి పోలీసులను పంపితే అక్కడ లేరని ఆయన తెలిపారు.

## నృసింహస్వామి సన్నిధిలో కురుగొండ్ల



నృసింహస్వామి దర్శనానంతరం అర్చకుల నుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న కురుగొండ్ల రామకృష్ణ

రాపూరు(డక్కిలి), జూన్ 3 : పెంచలకోన లక్ష్మీ నృసింహస్వామి, ఆది లక్ష్మీదేవి, ఆంజనేయ స్వామిని సోమవారం వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోత్సాహాలతో ఆశీర్వించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు భాస్కరరెడ్డి, టీఎంఆర్, పీర్ల సోమయ్య, కాపా శ్రీనివాసులు నాయుడు ఉన్నారు.

## కామాక్షితాయి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఈవోకి చెక్కును అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం, : మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ నిత్యాన్నదాన సదనానికి రేబాలకు చెందిన లేబూరు వెంకటరామిరెడ్డి, కోటేశ్వరమ్మ దంపతులు సోమవారం లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. అలాగే నెల్లూరులోని సరస్వతి నగర్‌కు చెందిన కోడూరు సాన్విక రూ.55,800 విరాళంగా ఇచ్చారు. ఈమేరకు చెక్కును ఆలయ ఈవో వి గిరికృష్ణకు అందజేయగా దాతలకు రసీదు అందజేసినట్లు తెలిపారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## 100 మద్యం సీసాల స్వాధీనం : ఇద్దరి అరెస్టు

కావలి రూరల్ : అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కావలిరూరల్ పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు కావలి పట్టణ కచ్చేరిమిట్ట రెండవ వీధికి చెందిన కొమ్ము చిట్టిబాబు ఎలాంటి అనుమతులు లేకుండా పట్టణంలోని వివిధ మద్యం దుకాణాల నుంచి తీసుకున్న 50 మద్యం సీసాలు ఇంటి వద్ద అధిక ధరకు అమ్ముకునేందుకు తీసుకువెళ్తూ ముసునూరు వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. అలాగే మండలంలోని బట్లదిన్నెకు చెందిన బడుగు ప్రభాకర్ 50 మద్యం సీసాలు తీసుకువెళ్తుండగా గ్రామం సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 154 |
| లేయర్ లైవ్ | 120 |
| స్కిన్ చికెన్ | 270 |
| స్కిన్‌లెస్ | 300 |
| లేయర్ | 204 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.6818 |
| వెండి కిలో ధర | రూ. 95,200 |
| వెండి ఒక గ్రాము | రూ. 94.50 |

## 8న ఎస్పీ బాలు జయంతి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 3 : చేతన సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి వై శేషగిరీశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు సాయంత్రం 6.30గంటలకు టౌనుహాలులో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు విద్యాసాగర్‌కు సంగీత విద్వన్మణి బిరుదుతో బాలు పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. సినీ కవి భువనచంద్ర, గాయకురాలు ఎస్పీ శైలజ, నటుడు శుభలేక సుధాకర్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, బాలు అభిమానులందరూ తరలిరావాలని కోరారు.

# బీసీజీ వ్యాక్సిన్ పంపిణీలో రెండో స్థానం

● జిల్లా లక్ష్యం 6.89 లక్షల మంది
● ఇప్పటికే 57 వేల మందికి టీకాలు
● క్షయ నివారణే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం
● గత నెల 16న పథకం ప్రారంభం

నెల్లూరు(వైద్యం) జూన్ 3: జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఓ కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. 2025 నాటికి క్షయను నివారించాలన్న ఉద్దేశంతో 60ఏళ్లు పైబడినవారికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయాలని నిర్ణయించింది. ఇందుకు గాను రాష్ట్రంలోని 12 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో నెల్లూరు జిల్లా కూడా ఉంది. ఈ క్రమంలో గత నెల 16 నుంచి బీసీజీ వ్యాక్సిన్‌ను వృద్ధులకు వేస్తున్నారు. ప్రతి గురువారం ఈ వ్యాక్సిన్ పంపిణీ జరుగుతుంది. కాగా ఇప్పటివరకు 57,837 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేశారు. కేవలం పురిటి పిల్లలకు మాత్రమే వేసే ఈ వ్యాక్సిన్ మొదటి సారిగా వృద్ధులకు వేసేలా కేంద్ర, రాష్ట్ర వైద్యాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో వృద్ధులు, క్షయవ్యాధి అనుబంధ కుటుంబీకులు కలిపి 6,89,286 మంది ఉన్నారని జిల్లా వైద్యాధికారులు నిర్ధారించారు. ఇందుకు అనుగుణంగా క్షయ వ్యాక్సిన్ వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలతోపాటు 10 సీహెచ్‌సీలు, 28 యూపీహెచ్‌సీల్లో వ్యాక్సిన్ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్థులు 10వేల మందికిపైగా ఉన్నారు. అయితే వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ప్రస్తుతం 1,648 మంది మాత్రమే క్షయ వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు చెబుతోంది. ఇందులో ప్రభుత్వపరంగా 1050 మంది చికిత్సలు పొందుతుండగా 592 మంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమం మూడు నెలల వరకు కొనసాగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

● జిల్లాకు రెండో స్థానం

పెద్దలకు వేసే క్షయ వ్యాక్సిన్‌లో రాష్ట్రంలో రెండో స్థానంలో జిల్లా ఉంది. జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణలో ఈ ఘనత సాధించారు. 2011లో బహుళ ఔషధ చికిత్స (ఎండీఆర్) ద్వారా వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. జిల్లా వ్యాప్తంగా 16 టీబీ యూనిట్లు, 41 గళ్ల పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. దీంతో పాటు వ్యాధిగ్రస్థులకు మంచి పోషకారం అందించేందుకు ప్రతి నెలా రూ. 500 ఇచ్చేలా ప్రభుత్వం కృషిచేస్తున్నది. క్షయ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే వ్యాధిని పూర్తిగా నివారించే వీలుంది. వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహిస్తే మూత్ర పిండాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వెన్నుముక, మెదడు పొరలపై, గర్భసంచి, ఎముకలు, కీళ్లపై క్షయ వ్యాపిస్తే ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే. హెచ్ఐవీ వ్యాధిగ్రస్థుల్లో 60 శాతం మంది క్షయ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది. వ్యాధిగ్రస్థుడు తుమ్మితే ఆ తుంపరలు గాలిలో కలిసి ఆరోగ్యవంతుడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కావున వ్యాధి లక్షణాలు తెలుసుకుని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.



నెల్లూరు : కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

### ఎవరు అర్హులు..?

- 60 ఏళ్లు పైబడినవారు. గడచిన ఐదేళ్లలో క్షయ వ్యాధివచ్చి తగ్గినవారు వ్యాక్సిన్‌కు అర్హులు.
- అలాగే క్షయవ్యాధిగ్రస్థులకు సన్నిహితంగా ఉన్నావారు.
- 18 ఏళ్లు నిండిన వారయితే, వారిలో ధూమపానం చేసేవారు, మధుమేహం ఉన్నవారు.
- బీఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్) 18 కన్నా అత్యంత బలహీనంగా ఉన్నవారు ఈ వాక్సిన్ వేసుకోడానికి అర్హులు.

### ప్రతి గురువారం వ్యాక్సిన్



బీసీజీ వాక్సిన్ పంపిణీలో నెల్లూరుజిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది, ఇది ఎంతో శభపరిణామం. దీంతో జిల్లాలో 6.89 లక్షల మందిని గుర్తించి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయాలని నిర్ణయించాం. ఇందుకు అనుగుణంగా ప్రతి గురువారం వ్యాక్సిన్ వేస్తున్నాం. ఈ వ్యాక్సిన్‌ను అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఉచితంగా వేస్తాం.

- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా క్షయ నివారణ అధికారి

## రంగడి వసంతోత్సవాల ప్రారంభం



స్వామివారికి తిరుమంజనం సేవ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 3 : నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో వసంతోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం రంగనాథస్వామికి నవకలశ స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. అనంతరం విశేష పుష్పాలంకారం, దివ్యప్రబంధ గోష్ఠి, ఆస్థాన సేవ జరిగాయి. ఆ తర్వాత ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా డాక్టరు సీ విజయసారథి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉత్సవాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, కార్యనిర్వహణాధికారి అర్వభూమి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

## కావలి చెరువులో చేపల దొంగలు

● అధికార పార్టీ నేతల అండదండలు

కావలి రూరల్, జూన్3: కావలి పెద్ద చెరువులో నీరు అడుగంటినా చేపల దొంగలు మాత్రం హల్‌చల్ చేస్తున్నారు. జిల్లాలో 21 చెరువులు పైలెట్ ప్రాజెక్టుల కింద ఉండగా, ఆ చెరువుల్లో చేపల వేట నిషేధం. గతంలో కావలి చెరువు సొసైటీ కింద ఉండగా 2001లో ఈ చెరువును పైలెట్ ప్రాజెక్టు కిందకు తెచ్చారు. అయితే అధికారపార్టీ నేతల అండతో గుట్టుచప్పుడు లేకుండా కొందరు చేపల వేట సాగించి సొమ్ము చేసుకున్నారు. చెరువులో నీరు అడుగంటినా చిన్న చిన్న గుంటలు కూడా వదలకుండా చేపల వేట సాగించటం, అధికారులు పట్టించుకోక పోవటం పట్టణంలో చర్చనీయాంశమైంది.

## కిలో పొగాకు ధర రూ.330

కలిగిరి, జూన్ 3: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 695 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 588 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-34, ఆర్ఆర్-1, సీఆర్-42, జంపింగ్‌లాట్స్-30 కారణాలతో 107 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.330, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.290.16గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

# అధ్వానంగా ప్రధాన కాలువలు

● సాగునీరందక ఆందోళనలో ఆయకట్టు రైతులు
● చోద్యం చూస్తున్న అధికారులు

పరికుంటపాడు, జూన్ 3: మెట్టప్రాంత రైతుల వరప్రసాదిని అయిన గండిపాళెం జలాశయం ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూతవేటు దూరంలో రిజర్వాయర్ ఉన్నప్పటికీ అక్కడి రైతులకు సాగునీరు అందని ద్రాక్షాలా మారింది. వ్యవసాయ పనుల ఆరంభం సమయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నా భూములకు మాత్రం నీరందడం లేదు. ఏళ్ల తరబడి ఇలాంటి తంతే కొనసాగుతుండడంతో వరికుంటపాడు, ఉదయగిరి మండలాల రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో రిజర్వాయర్‌లోకి సమృద్ధిగా నీరు చేరుతుందన్న ఆశతో ఉన్న రైతులు ఈ సీజన్‌లోనూ నిరాశతోనే ఉన్నారు.



అధ్వానంగా మారిన కాలువ

● తొలి నుంచి అంతే..

ఆయా మండలాల సరిహద్దు ప్రాంతంలో అక్కడి రైతులకు అనుకూలంగా ఉండేలా 1975లో గండిపాళెం రిజర్వాయర్ నిర్మాణానికి రూపకల్పన చేశారు. అప్పట్లో సమీప గ్రామాల్లోని బీడు భూములు సాగులోకి వచ్చాయి. క్రమేణా కుడి, ఎడమ కాలువలకు రూ. 25కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన ఆధునీకీకరణ పనులు అర్ధంతరంగా నిలిచాయి. దీంతో అంతవరకు పంటల సాగుతో కళకళలాడిన భూములు కళ్లెదుటే బీడు భూములుగా మారాయి. ఇక వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న కొంతమంది రైతులు పొలాలను అమ్ముకొని వలసబాట పట్టారు.

● ఎప్పటికి పూర్తయ్యేనో...?


ఈ రిజర్వాయర్ పరిధిలో మొత్తం 16వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, అందులో కేవలం ఎడమ కాలువ కింద వరికుంటపాడు మండలం పరిధిలోనే 11వేల ఎకరాలు ఉండడం గమనార్హం. అలాగే కుడి కాలువ కింద ఉదయగిరి, వరికుంటపాడు మండలాలను కలిపి మరో 5వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయినా తొలి నుంచి సగభాగం ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఏళ్ల తరబడి ఆశగా ఎదురుచూస్తున్నప్పటికీ నిరాశే మిగులుతుంది. ప్రధాన కాలువలతో పాటు లింకు కాలువలు సైతం అధ్వానంగా మారి సాగునీరు ముందుకుసాగే పరిస్థితులు కనిపించడం లేదు. దారి పొడవునా కంపచెట్లు కమ్ముకు పోవడంతో కట్ట దెబ్బతిని నామరూపాలు లేకుండా పోయాయి. రానున్న రోజుల్లో ఈ కాలువలకు సాగునీరు విడుదల చేసినప్పటికీ లింకుల ద్వారా వృథా అవడం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం చెరువులకు నీరందించే పరిస్థితులు కూడా లేకపోవడంతో సమీప పొలాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందే అవకాశం లేకుండా పోతుందని వారు వాపోతున్నారు. ఈ తరుణంలో చుక్క నీటికి నోచుకోని చెరువులు సైతం ఆక్రమణకు గురవుతున్నాయనే విమర్శలు వెత్తువెత్తుతున్నాయి. ఇటీవల లింకు కాలువలకు చేపట్టిన మరమ్మతులు సైతం నాసిరకంగా చేపట్టడంతో నిధులు వృథాగా మారాయి. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి కాలువలకు మరమ్మతులు చేయించి ఆయకట్టు భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కంపచెట్లతో నిండిన కాలువ

## సాగరం చెరువులో పుష్కలంగా నీరు

● రైతుల చొరవతో కాలువ అభివృద్ధి
● రెండోకారు పంటకు సన్నద్ధం



అనంత సాగరం చెరువులో పుష్కలంగా ఉన్న నీరు

అనంతసాగరం, జూన్ 3: అనంతసాగరం చెరువులో ఆశాజనకంగా నీరు ఉండటంతో రెండోకారు పంటకు రైతులు సిద్ధం అవుతున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో నీటిఎద్దడితో పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. అందుకు భిన్నంగా సాగరం రైతులకు మాత్రం మహర్దశ పట్టినట్టు రెండోకారుకు సరిపడ జలాలు చెరువులో అందుబాటులో ఉండటంతో సాగుదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇది ఇలా ఉంటే ప్రభుత్వ యంత్రాగం కాలువ అభివృద్ధి గురించి పట్టించుకోకపోయిన రైతులే చేయిచేయి కలిపి నిధులు సమకూర్చుకొని సుమారు 3కిమీలు పొడవైన ఊర కాలువను ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు చేయించుకున్నారు. మొదటి పంట సమయంలో వచ్చిన దిగుబడికి ఆశాజనకపు ధర లభించడంతో రైతుల్లో ఉత్సాహం కనిపిస్తుంది. నేటికి పుట్టి ధాన్యం రూ.26 వేల నుంచి రూ.28 వేలు ఉండడంతో ఇదే ధర కొనసాగింపుగా రెండవ పంట చేతికందే వరకు ఉండడచ్చన ఆలోచనతో మొదటి పంటతో సరిపెట్టుకొనే రైతులు సైతం చెరువు పరిధిలో రెండో పంటకు సిద్ధం అవుతున్నారు. చెరువు ఆయకట్టు పరిధిలోని మంచాలపల్లి, అనంతసాగరం, బెడుసుపల్లి, లింగంగుంట గ్రామాల్లో 2వేల ఎకరాలు వరిసాగుక వ్యవసాయ పనులు మొదలైయ్యాయి. విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో వుండేలా అధికారులు చూడాలని కోరుతున్నారు.



చెరువు కింద వరిసాగుకు సిద్ధం చేసిన పొలం

### సోమశిలకు 59 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం 59క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 7.368 టీఎంసీల నీరు నిల్వ ఉండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

## హమ్మయ్యా... చల్లబడింది !

● నైరుతి రాకతో తగ్గిన వేసవి మంటలు ● ఊపిరి పీల్చుకున్న జిల్లావాసులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 3 : నైరుతి రుతుపవనాల రాకతో జిల్లా వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. పలుచోట్ల వర్షపు జల్లులు కురిశాయి. సుమారు రెండు నెలలుగా తీవ్ర ఎండ వేడి, ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలకు రుతుపవనాల రాకతో ఉపశమనం లభించింది. మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, దుత్తలూరు, సీతారాముపురం తదితర మండలాల్లో వర్షం కురవడంతో అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు 40 డిగ్రీలకు పైగా నమోదైన ఉష్ణోగ్రత సోమవారం 32.2 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. చల్లని గాలులు వీచడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. నెల్లూరు నగరంలో వాతావరణం మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయి. కాగా, జిల్లాలో సోమవారం అత్యధికంగా ఉదయగిరిలో 85.6 మి.మీ వర్షపాతం నమోదుకాగా, సీతారామపురంలో 85.4, కందుకూరులో 6.8, గుడ్లూరులో 2.2, దగదర్తిలో 5.6, బుచ్చిలో 2.4, పొదలకూరులో 3.2, కలువాయిలో 3.6, సంగంలో 17, ఏఎస్‌పేటలో 1.4, అనంతసాగరం 2.8, చేజర్లలో 3 మి.మీ వర్షం పడింది.

### వేరుశనగ వర్షార్పణం : ఆందోళనలో రైతులు

ఉదయగిరి రూరల్ : ఉదయగిరి మండలం కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన వేరుశనగ పంట నీట మునిగి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. రైతు దేవసాని శ్రీనివాసులురెడ్డి తనకున్న 1.50 ఎకరాలో సుమారు రూ.40 వేలు ఖర్చు చేసి వేరుశనగ సాగు చేశాడు. పంట కోత దశకు రావడంతో రెండు రోజుల క్రితం కూలీలతో పీకించి మిషన్ ఆడిచేందుకు ఓదెలను పొలంలోనే ఉంచాడు. ఆది, సోమవారాల్లో కురిసిన భారీ వర్షాలకు పొలంలో నీరు చేరి ఓదెలన్నీ తడిసిపోయాయి. దీంతో కాయ నాణ్యత దెబ్బతినడంతోపాటు మొలకలు వచ్చాయి. ఆరుగాలం కష్టించి తీరా పంట చేతికందే సమయంలో వర్షార్పణం కావడంతో రైతు లబోదిబోమంటున్నాడు. మిగిలిన రైతులదీ ఇదే పరిస్థితి. వ్యవసాయాధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కర్షకులు కోరుతున్నారు.



నీట మునిగిన వేరుశనగ పంట ఓదెలు

## మహారాజ్ఞికి రావణ సేవ

● దశకంఠుడిపై ఊరేగిన ఆదిదంపతులు



బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 3 : జొన్నవాడ కామాక్షమ్మ ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారు రావణ వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చేసిన ప్రత్యేక పుష్పాలంకరణ, విద్యుద్దీపాలు ఆకట్టుకున్నాయి. భక్తులు అడుగడుగునా వారి ఇళ్ల ముందు చలువ పందిళ్ళు, రంగవల్లులతో స్వామి, అమ్మవార్లకు స్వాగతం పలికి నివేదనలు సమర్పించారు. కాగా, ఆలయంలో ఉదయం తిరుచా ఉత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాలలో మంగళవారం ఉదయం గిన్నెభిక్ష గ్రామోత్సవం, రాత్రి వెండి నందిసేవ జరగనున్నాయి.

# ఆ ఇద్దరెవరో..!

- ఆత్మకూరు, ఉదయగిరి అభ్యర్థుల విజయంపై ఎడతెగని ఉత్కంఠ
- నేడు తేలనున్న నేతల భవితవ్యం !

**ఆత్మకూరు, జూన్ 3:** ఈ మారు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు అసెంబ్లీ బరిలో 13మంది పోటీ ఉన్నారు. వీరిలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు 10మంది కాగా, మిగిలిన వారు స్వతంత్రులుగా ఉన్నారు. అయితే పోటీ మాత్రం టీడీపీ, వైసీపీ మధ్యే నువ్వా.. నేనా అన్నట్లుగా ఉంది. మరి కొన్ని గంటల్లో నేతల భవితవ్యం తేలనుంది.

### గెలుపు ధీమాలో ఎవరికి వారు..

ఆత్మకూరు అసెంబ్లీ బరిలో నిలిచిన టీడీపీ, వైసీపీ అభ్యర్థులిద్దరూ గెలుపు తమదంటే తమదేనని ధీమాగా ఉన్నారు. అనూహ్యంగా టీడీపీ టిక్కెట్ దక్కించుకుని ఎన్నికల బరిలో దిగిన ఆనం రామనారాయణరెడ్డి తప్పకుండా గెలుపొంది అసెంబ్లీలో తిరిగి అడుగు పెట్టడం ఖాయమనే ధీమాలో ఉన్నారు. గత ఉప ఎన్నికల్లో ఆత్మకూరు నియోజవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి ఈసారి విజయలక్ష్మీ తననే వరిస్తుందన్న ధీమాతో ఉన్నారు. అయితే ఇరుపార్టీల నేతలు, కార్యకర్తలు మాత్రం ఉత్కంఠను భరించలేకున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు పందెం రాయుళ్లు మాత్రం బెట్టింగు జోరు కొనసాగిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గం మొత్తం మీద 83.49శాతం పోలింగ్ జరిగింది. కొన్నిగ్రామాల్లో 90శాతం పైబడి పోలింగ్ జరిగింది. 2,15,401 మంది ఓటర్లుకు గాను 1,79,829 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,05,815 మంది పురుషుల్లో 88,854మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేక్రమంలో 1,09,578 మంది మహిళల్లో 90,974మంది ఓటుహక్కును వినియోగించుకు న్నారు. చేజర్ల మండలంలో అత్యధికంగా 88.47శాతం పోలింగ్ నమోదు కాగా ఆత్మకూరు మండలంలో అతి తక్కువగా 80.96శాతం పోలింగ్ నమోదైంది. మర్రిపాడు మండలంలో 81.78శాతం పోలింగ్ నమోదు కాగా సంగం మండలంలో 84.33శాతం, ఏఎస్‌పేట మండలంలో 84.56శాతం, అనంతసాగరం మండలంలో 83.35శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఆత్మకూరు మండలం మినహా మిగిలిన అన్ని మండలాల్లో 80శాతం పైబడి పోలింగ్ నమోదు కావడం నియోజకవర్గ చరిత్రలో రికార్డు సృష్టించినట్లయ్యింది. ఈ ఎన్నికల్లో ఆత్మకూరులో 3,131మంది బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ ఆధిపత్య గ్రామాల్లో భారీ ఎత్తున పోలింగ్ జరిగింది. తమకు అనుకూలంగా ఓటింగ్ చేసుకోవడంలో ఇరువర్గాల నాయకులు విజయవంతం అయ్యారు. ఆధిపత్య గ్రామాల్లో జరిగిన భారీ పోలింగ్ ఫలితాలను తారుమారు చేస్తుందన్న అనుమానం లేకపోలేదు. ఏదీ ఏమైనా ఆత్మకూరు విజేత ఎవరో మరికొన్ని గంటల్లో తేలనుంది.




ఆనం రామ నారాయణరెడ్డి (టీడీపీ)



మేకపాటి విక్రమ్‌రెడ్డి ( వైసీపీ )



కాకర్ల సురేష్ (టీడీపీ)



మేకపాటి రాజగోపాల్‌రెడ్డి (వైసీపీ)

**ఉదయగిరి:** నియోజకవర్గం నుంచి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మరియు స్వతంత్ర్య అభ్యర్థులు 15మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధానంగా వైసీపీ, ఉమ్మడి టీడీపీల నడుమ పోటీ ఉన్నది. వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ల మధ్య పోటీ హోరాహోరీగా కొనసాగింది. వీరు ఇరువురు ఎన్నికల్లో తొలిసారి పోటీ చేయడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠత నెలకొంది. నియోజకవర్గ ఫలితాలపై ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. రెండుసామాజిక వర్గాల మధ్య జరిగిన ఎన్నికల్లో ఆయా సామాజిక వర్గాల ఓటర్లు పోటాపోటీగా ప్రచారం నిర్వహించడమే కాక ఓటింగ్ సరళి పెంచేందుకు కృషి చేశారు. నియోజకవర్గ కౌంటింగ్ సాయంత్రం నాలుగు గంటలకు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కౌంటింగ్‌కు అధికారులు 14టేబుళ్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 1,97,970 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ తుది ఫలితాలు సాయంత్రం ఆరు గంటలకు వెలువడే అవకాశముంది. ఏదిఏమైనా మరికొన్ని గంటల్లో వెలుబడే అభ్యర్థుల ఫలితాల కోసం నియోజకవర్గ ఓటర్లు ఎదురుచూస్తున్నారు.

## కావలి

## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



# కౌంటింగ్‌పై కావలి నేతల్లో ఉత్కంఠ

- టీడీపీ, వైసీపీ మధ్యే ప్రధాన పోటీ
- ఇండిపెండెంట్ పసుపులేటి సుధాకర్‌తో ఎవరికి నష్టం ?
- పట్టణంలో భారీగా బెట్టింగ్‌లు
- ఎంపీ అభ్యర్థి క్రాస్ ఓటింగ్‌పై భయం..భయం !

**కావలి, జూన్ 3:** కావలి నియోజకవర్గంలో మొత్తం 2,38,553 ఓట్లకు గాను మే 13న జరిగిన పోలింగ్‌లో 1,98,066 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మంగళవారం నెల్లూరులో కౌంటింగ్ జరగనుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులలో ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటీ జరగగా, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్ కూడా గట్టి పోటీ ఇచ్చారు. అయితే గెలుపు ఓటములు టీడీపీ, వైసీపీ మధ్యే ఉండగా ఇండిపెండెంట్ అభ్యర్థి వలన ఎవరికి నష్టం జరుగుతుందా ? అని ప్రధాన పార్టీలలో ఉత్కంఠ నెలకొంది. 2019 ఎన్నికలలో కావలిలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. ఈసారి కూడా క్రాస్ ఓటింగ్ ప్రభావం ఎవరిని ముంచుతుందోననే అనుమానాలు ఉన్నాయి. వైసీపీలోని కొందరు ప్రధాన నేతలు ఎంపీ అభ్యర్థి కోసం పనిచేసినట్లు, ఎమ్మెల్యే అభ్యర్థి కోసం పనిచేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో కావలిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి నష్టం జరుగుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తొలుత టీడీపీ కన్నా ముందంజలో ఉన్న వైసీపీ పోలింగ్ నాటికి కొంత వెనుకపడిందనే ప్రచారం నెలకొంది. దీంతో టీడీపీ అభ్యర్థి విజయంపై ఆ పార్టీ నేతలలో బలమైన నమ్మకం ఏర్పడింది. గతంలో గెలుపు పందేలలో ముందుంటున్న వైసీపీ ఈసారి వెనుక పడటంతో ఒకటికి రెండు రెట్లు టీడీపీ ఇచ్చే విధంగా పందేలు జరిగాయి. దానికి కూడా ఆశించిన స్థాయిలో పందేలకు రాకపోవటంతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి 10వేల మెజార్టీ ఓట్లు పైన వస్తాయని టీడీపీ నేతలు పందెం కట్టగా, అన్ని రావని వైసీపీ నేతలు పందేలు కట్టారు. అంటే దీనిని బట్టి టీడీపీ ముందంజలో ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఏదిఏమైనా టీడీపీ, వైసీపీ మధ్య నువ్వా - నేనా అన్నట్లుగా పోటీ ఉండటంతో కౌంటింగ్ ఫలితాల కోసం ఆయా పార్టీల నేతలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కాగా, కావలి నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి అవుతున్నందున లెక్కింపు పూర్తయ్యేసరికి సాయంత్రం 7 గంటలు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు.

# మధ్యాహ్నానికల్లా కందుకూరు ఫలితం

**కందుకూరు, జూన్ 3:** ఓట్ల లెక్కింపు గడియలు వచ్చేయటంతో అటు అభ్యర్థులు.. ఇటు ప్రజల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కందుకూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరిగే నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం 6గంటలకే పోలింగ్ ఏజెంట్లు ఉండాలన్న అధికారుల సూచించారు. ఆ మేరకు నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు సోమవారం సాయంత్రమే ఇక్కడి నుంచి బయలుదేరి నెల్లూరు చేరుకున్నారు. ఉదయాన్నే కందుకూరు నుంచి బయలుదేరి సకాలంలో వెళ్లటం సాధ్యంకాదన్న ఆలోచనతో రాత్రికే చేరుకుని అక్కడే బసచేసేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ఏజెంట్లుకి ఏర్పాట్లు పూర్తిచేశారు. 21మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా.. ప్రధాన పోటీ తెలుగుదేశం అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌ల మధ్యే ఉంటుందని మిగిలిన వారంతా నామమాత్రపు పోటీదారులేనన్న విషయం సుస్పష్టం. ఇండిపెండెంట్లలో కొందరు ప్రధాన పార్టీల అభ్యర్థుల సూచన మేరకు నామినేషన్లు వేసిన వారే కావటంతో వారి తరపున ఏజెంట్లుగా వెళ్లే వారు కూడా అనధికారికంగా ప్రధాన అభ్యర్థుల కోసమే కౌంటింగ్ ఏజెంట్లుగా వ్యవహరించనున్నారు. దీంతో టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఒక్కో టేబుల్ వద్ద తమ ఏజెంట్లు ఐదుగురు ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం.

కందుకూరు నియోజకవర్గంలో 2,28,979 ఓట్లు ఉండగా వాటిలో 2,03,637 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలోని 271 పోలింగ్ కేంద్రాలలో ఈ ఓట్లు పోలవగా ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. అంటే ప్రతిరౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాల లెక్కింపు పూర్తవుతున్నందున మొత్తం 20రౌండ్లలో కందుకూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరగనుంది. రౌండ్‌కు 15 నిమిషాలు సమయం అనుకున్నా 5గంటల్లో కందుకూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. ఉదయం 8గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నందున మధ్యాహ్నం ఒంటి గంటకే తుది ఫలితం తేలే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, హోమ్ ఓటింగ్, ఇతర జిల్లాల ఓట్లు, సర్వీస్ ఓట్లు కలిపి 2705 ఓట్లు పోలై ఉండగా వాటి లెక్కింపుకు ప్రత్యేకంగా ఒక టేబుల్ ఏర్పాటు చేశారు. దీంతో ఈవీఎంల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి ఈఓట్లు లెక్కింపు కూడా పూర్తవుతుంది. అందువల్ల మధ్యాహ్నం ఒంటిగంటకల్లా తుదిఫలితం వస్తుందని ఉదయం 11గంటలకల్లా ఎవరికి విజయావకాశాలు ఉన్నాయనే విషయంలో స్పష్టమైన అంచనాకు రావచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### ప్రజలు, అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్

## ఆత్మకూరులో ఉరుములు, మెరుపులతో వర్షం

**ఆత్మకూరు, జూన్ 3:** మెట్టప్రాంతమైన ఆత్మకూరులో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. రోజంతా మేఘావృతమై మబ్బులు కమ్మి ఉండడంతో నిప్పులు చెలరేగిన సూరీడు ఒక్కసారిగా శాంతించాడు. ఎండ తీవ్రత నుంచి ఉపసమనం లభించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మరో రెండురోజుల పాటు సాధారణం కంటే అధిక వర్షాలు కుస్తాయని ఐఎండీ సూచనల నేపథ్యంలో వ్యవసాయం జోరుగా సాగుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఉదయగిరిలో 85.6 మి.మీ వర్షం

**ఉదయగిరి, జూన్ 3:** ఉదయగిరి ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున 4నుంచి 5.30గంటల వరకు 85.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపుల దాటికి గ్రామాల్లో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అనేకచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం 9గంటలకు విద్యుత్ సరఫరాను సిబ్బంది పునరుద్ధరించారు. మండలంలోని నేలటూరు, గడ్డంవారిపల్లి, వెంకట్రావుపల్లి చెరువుల్లో కొద్దిపాటి వర్షపు నీరు చేరింది.

## సంగంలో స్వల్పంగా..

**సంగం:** మండలంలో మంగళవారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోజంతా వాతావరణం చల్లగా ఉంది. గత పదిహేను రోజులుగా వడగాలులకు, ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలు వాతావరణం చల్లబడడంతో హాయిగా స్వేదతీరారు. నైరుతీ రుతుపవనాల రాకతో వాతావరణం మారడంతో ఎండల నుంచి ప్రజలు ఉపసమనం పొందారు.

## కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

**సంగం, జూన్ 3:** స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం మంగళవారం కొనసాగింది. అందులో భాగంగా లైబ్రియన్ రవీంద్రనాథ్‌రెడ్డి పిల్లలకు చందమామ కథలను చదివించడం, భావాలను వివరించారు. అదేవిధంగా చంద్రగ్రహణం, సూర్యగ్రహణం ఎలా ఏర్పడతాయో పిల్లలకు వివరించారు. బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గురించి అందులోని పలు అంశాలతో పాటు ప్రజాప్రతినిధుల చట్టసభల గురించి వివరించారు.

## కాకర్ల విజయం తథ్యం


**దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 3:** నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి కాకర్ల విజయం తథ్యమని పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి చల్లా ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెట్ట ప్రాంత అభివృద్ధికి గత రెండేళ్లుగా తన ట్రస్టు ద్వారా విశేష సేవలందిస్తూ ప్రజల మనుసుల్లో చెరగనిముద్ర వేసుకొన్నట్లు చెప్పారు. సేవలను గుర్తించి నియోజకవర్గ ప్రజలు ఆయన రుణాన్ని ఓటు ద్వారా తీర్చుకోనున్నారని తెలిపారు. కరువు కోరల్లో చిక్కిన మెట్ట ప్రాంతానికి కాకర్ల విజయంతో వెలుగు వస్తుందన్నారు.

## అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు

**ఉదయగిరి, జూన్ 3:** మెట్టప్రాంతంలో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షానికి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో వ్యవసాయ భూముల్లో పదునెక్కే విధంగా వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్ పంటలను వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. భూములను దుక్కులు దున్నేందుకు అన్నదాతలు కాడిమేడి సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు.

## చెత్త సంపద కేంద్రాల నిరుపయోగం

**మర్రిపాడు, జూన్ 3:** మండలకేంద్రంతో పాటు డీసీపల్లి, చిన్నమాచునూరు, కృష్ణాపురం మేజర్ పంచాయతీలతో పాటు మరో 20పంచాయతీలున్నాయి. వీటిలో పూర్తిస్థాయిలో చెత్తను కేంద్రాలకు తరలిస్తున్న పరిస్థితి లేదు. పారిశుధ్య పనులు చేసేందుకు అవసరమైన కార్మికులను నియమించినా వారికి జీతాలు చెల్లించక పోవటంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకపోయింది. చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన వాహనాలు మూలకుచేరాయి. గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా సేకరించేందుకు హరిత రాయబారులను ఏర్పాటు చేశారు. వారికి సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో విధులు సక్ర మంగా నిర్వర్తించడం లేదు. ఈ సమస్యతో గ్రామాల్లోని ఏ కాలనీల్లో చూసినా చెత్త పేరుకపోయి పారిశుధ్యం కొరవడింది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఘనవ్యర్థాల కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి.



చిన్నమాచునూరులోని చెత్త సంపద కేంద్రం

## సర్కిల్‌లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు

**ఉదయగిరి రూరల్, జూన్ 3:** కౌంటింగ్ సందర్భంగా ఉదయగిరి సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీఐ వేల్పుల గిరిబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన కౌంటింగ్ విషయంపై విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు గుమికూడి ఉండరాదన్నారు. 30పోలీస్ యాక్ట్, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సంబరాలు, ర్యాలీలు నిషేధమన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని టీడీపీ, వైసీపీ కార్యాలయాలతో పాటు ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

**సీతారామపురం, జూన్ 3:** ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్ఐ అనూష కోరారు. సోమవారం సీతారామపురంలోని దుకాణదారులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం అయ్యారు. నాలుగో తేదీ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలక్షన్ కమిషన్ వారి ఆదేశాలతో మండలంలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30అమ ల్లో ఉంటుందన్నారు. అనంతరం ఎస్ఐ అనూష విలేకరులతో మాట్లాడారు. ఎక్క డైనా గుంపులుగా ప్రజలు ఉండకూడదని, ఎలాంటి ర్యాలీలు, బాణాసంచా, ఊరేగింపులు చేసుకోవడానికి అనుమతి లేదన్నారు. అత్యవసర సేవలు, దుకాణాలు మాత్రమే అందు బా టులో ఉంటాయని మండల ప్రజలు పోలీసు వారికి సహకరించాలన్నారు. అంతేకాకుండా సీతారామపురం బస్టాం డ్ సెంటర్, సింగారెడ్డిపల్లి, బసినేనిపల్లి గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఉంటుందని, మండలంలో రెండు మొబైల్ పార్టీలు విధులు నిర్వర్తిస్తుంటాయని తెలిపారు.



సీతారామపురం: దుకాణదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ అనూష

## వైభవంగా కోదండరాముడి కల్యాణం



కల్యాణం తిలకిస్తున్న భక్తులు



భక్తులకు మంగళసూత్రం చూపుతున్న పూజారి

**సంగం, జూన్ 3:** రామచంద్రపురంలో వెలసిన కోదండరామస్వామి కల్యాణంను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతా సమేత కోదండరామస్వామి ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదిక మీదకు చేర్చి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల నడుమ వేడుక జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**ఆత్మకూరు, జూన్ 3:** మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల ఏడు కుటుంబాలకు చెందిన వారు మృతి చెందారు. సోమవారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఏడు కుటుంబాల సభ్యులకు పరామర్శించారు. ఒక్కొరికి రూ.10వేలు చొప్పున రూ.70వేలను అందజేశారు. మృతులు 8వ వార్డులో గుండ్లూరు సుబ్బారావు, 5వ వార్డు ఉప్పుటూరు సుబ్రహ్మణ్యం, 8వ వార్డు గాలి కమలమ్మ, 1వ వార్డు కోలా అంకమ్మ, నల్లగట్ల పెంచలయ్య, 18వ వార్డు షేక్ మునీర్బా, షేక్ పర్వీన్‌లు ఉన్నారు. కష్ట కాలంలో తమకు ఆర్థిక సాయం అందజేసిన శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

## మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

**ఉదయగిరి, జూన్ 3:** గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం పట్టణంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాత్రివేళ దోమలబారిన పడకుండా దోమతెరలు వాడాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాతవాటర్‌బాటిళ్లు, టెంకాయచిప్పలను ఇళ్ల పరిసాలకు దూరంగా పారవేయాలన్నారు. కార్యక్ర మంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



ఉదయగిరిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

## పోస్టుమన్‌కు ఉత్తమ అవార్డు

**అనంతసాగరం, జూన్ 3:** స్థానిక తపాలా కార్యాలయ పోసుమెన్ షేక్ ఖాజావలి ఉత్తమ ఆంధ్ర పోస్ట్‌మ్యాన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన చేస్తున్న సేవలకు గుర్తించి అవార్డు అందుకోవడం ఇది మూడోసారి. ఆయన్ను అసిస్టెంట్ పోస్టల్ సూపరిడెంట్ మహ్మద్ హాసేన్, సహ ఉద్యోగులు, ప్రజాసంఘాల నేతలు, స్థానికులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఇంటూరి విజయం కోసం పూజలు

**వలేటివారిపాలెం, జూన్ 3 :** బడేవారిపాలెం శివాలయంలో టీడీపీ కార్యకర్తలు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు గెలవాలని సోమవారం 101కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అలాగే మహా కూటమి ఘన విజయం సాధించి, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని మొక్కుకున్నారు.

## నెల్లూరుకు తరలిన నేతలు, ఏజెంట్లు



కౌంటింగ్ కోసం నెల్లూరు తరలివెళుతున్న టీడీపీ అభ్యర్థి క్రిష్ణారెడ్డి, కౌంటింగ్ ఏజెంట్లు

**కావలి, జూన్ 3:** నెల్లూరులో మంగళవారం జరగనున్న కౌంటింగ్‌కు కావలి నుంచి టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, స్వతంత్ర పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు, కౌంటింగ్ ఏజెంట్లు సోమవారం సాయంత్రం నెల్లూరుకు తరలివెళ్లారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వారి కౌంటింగ్ ఏజెంట్లకు కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు తెలిపి అత్యవసరమైతే తప్ప వివాదాల జోలికి వెళ్లివద్దని సూచించారు. కొందరు స్వతంత్ర అభ్యర్థుల తరపున కూడా ప్రధాన పార్టీలు వారి నేతలను కౌంటింగ్ ఏజెంట్లుగా నియమింపచేశారు. రాత్రికి అక్కడ బస ఏర్పాటుచేసి మంగళవారం తెల్లవారుజాము నుంచే వారు కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నారు.

## ఎగ్జిట్ పోల్స్ తర్వాత పందేల జోరు

**లింగసముద్రం, జూన్ 3:** ఎగ్జిట్ పోల్స్ అనంతరం కూడా మండలంలో కూటమి, వైసీపీ పార్టీల గెలుపోటములపై పందేలు జోరుగా కాస్తున్నారు. కొన్ని సర్వే సంస్థలు కూటమి గెలుస్తుందని, మరికొన్ని సర్వే సంస్థలు వైసీపీ గెలుస్తుందని తమ ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. అయితే నేషనల్ మీడియా ఎక్కువగా కూటమి గెలుస్తుందని చెప్పాయి. అయినా మండలంలోని కొందరు వైసీపీ గెలుస్తుందని, ఇందుకు ఒకటికి రెండు వంతున నగదు ఇవ్వాలని కోరగా, అయితే టీడీపీనే గెలుస్తుందని అందుకు అంగీకరించి పందేలు కాస్తున్నారు. ఈ పందేలు సోమవారం కూడా లింగసముద్రం, పెదపవని గ్రామాల్లో జరిగినట్లుగా తెలిసింది. ఇప్పటికే మండలంలో సుమారు రూ.3 కోట్లకు పైగానే పందేలు కాసినట్టుగా సమాచారం.

## చిరువ్యాపారికి చేయూత

**కావలి టౌన్, జూన్ 3:** పట్టణంలోని వెంగళరావునగర్ 23వ వార్డులో నివసిస్తున్న చిరు వ్యాపారి బాదుల్లా అనారోగ్యంతో బాధపడుతుండగా హ్యాపీ సేవాసంస్థ సభ్యులు సోమవారం పరామర్శించారు. సంస్థ ద్వారా విషయం తెలుసుకున్న ఖాసిం స్నేహితులు ముందుకొచ్చి వైద్య ఖర్చుల కోసం రూ. 30వేల నగదు, పండ్ల వ్యాపారం చేసుకునేందుకు తోపుడు బండిని అందించారు.

## నాదెండ్ల మనోహర్‌కు శుభాకాంక్షలు

**కావలిటౌన్, జూన్ 3:** జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ సోమవారం తెనాలిలోని జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. సుధాకర్ మాట్లాడుతూ తెనాలి ఎమ్మెల్యేగా నాదెండ్ల గెలుపు ఖాయమని, పవన్‌కల్యాణ్ ఆశీ ర్వాదంతో ఎన్డీయే ప్రభుత్వంలో కీలక శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు.



నాదెండ్లకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న అళహరి

# ప్రయాణికులకు నిలువ నీడేది?

- కానరాని బస్‌షెల్టర్
- మండుటెండలో ప్రజలకు తప్పని అవస్థలు
- చెట్ల నీడన, దుకాణాల వద్ద నిరీక్షణ
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

**వలేటివారిపాలెం, జూన్ 3:** స్థానిక బస్టాండు సెంటరులో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ బస్సుల కోసం చెట్ల కింద, దుకాణాల వద్ద నిరీక్షిస్తున్నారు. వలేటివారిపాలెంలో బస్‌స్టేషన్ ఉన్నా నిరుపయోగంగా ఉంది. మండలంలోని వివిధ గ్రామాల నుండి మండల కేంద్రానికి వచ్చి వెళ్లేవారు దుకాణాల వద్ద హోటళ్ల వద్ద బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తుంది. ప్రయాణికులు దుకాణాల వద్ద నిలబడితే తమ వ్యాపాలకు ఆటంకం కలుగుతుందని దుకాణదారులు అక్కడి నుంచి పంపుతున్నారు. ఎండాకాలం ఎండలు తీవ్రత అధికంగా ఉండడంతో నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో గ్రామీణ ప్రాంతాల నుండి మండల కేంద్రానికి వివిధ పనులపై వస్తుంటారు. వీరికి మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో వారి బాధులు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా మహిళలు మలమూత్ర విసర్జనకు ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతుంటారు. ఎప్పుడు పడితే అప్పుడు చార్జీలు పెంచి ప్రయాణికుల నుండి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ సౌకర్యాల కల్పనలో మాత్రం దృష్టి సారించకపోవడంపై పలు విమర్శలు తావిస్తోంది. మారుమూల గ్రామాల ప్రయాణికులు అవస్థలు పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ప్రయాణికుల సౌకర్యార్థమే ఆర్టీసీ ప్రధాన ధ్యేయం అని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం అమలు కావడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ నిర్మించి మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

## సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా : సీఐ

**కలిగిరి, జూన్ 3:** కలిగిరి సర్కిల్ పరిధిలోని జలదంకి, కలిగిరి, కొండాపురం, వింజమూరు మండలాల్లోని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. సోమవారం సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో సోమవారం నుంచి మంగళవారం రాత్రి వరకు లాడ్జిలు, రెస్టారెంట్లు, హోటల్స్ మూసివేయాలన్నారు. జూన్ 6 వరకు బాణాసంచ కాల్చడం, బహిరంగ సభలు, ర్యాలీలు, విజయోత్సవ సంబరాలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై రౌడీషీట్స్ ఓపెన్ చేస్తామన్నారు.

### సంబరాలు, ర్యాలీలకు అనుమతి లేదు : ఎస్సై

**కొండాపురం :** మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదని ఎస్సై మహేంద్ర సోమవారం తెలిపారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బాణాసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేదిం చినట్లు చెప్పారు. సునిశిత ప్రాంతాలైన కొమ్మి, సాయిపేట, తూర్పుఎర్రబల్లి, గొట్టిగుండాల, సత్యవోలు తదితర పంచాయతీలలో ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



భీమవరప్పాడు గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై మహేంద్ర

## రాయపేటలో తాగునీటి ఎద్దడి : గ్రామస్థుల అవస్థలు

**అల్లూరు, జూన్ 3 :** నగర పంచాయతీ పరిధిలోని రాయపేట గ్రామంలో తాగునీటి ఎద్దడితో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు గ్రామంలో పర్యటించినపుడు తమ ప్రభుత్వం వస్తే ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తామని హామీలు ఇవ్వడమే తప్ప అమలుపరచిన దాఖలాలు లేవని, తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి నూతన ప్రజాప్రతినిధులైనా తమ గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారించకపోతారా అని గ్రామస్థులు ఎదురుచూస్తున్నారు.



రాయపేటలో వాటర్ ట్యాంక్

### ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో

## ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి ప్రతిభ

**కందుకూరు, జూన్ 3:** ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ 2024 పరీక్షలో కందుకూరు బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి ఏ.శ్యామ్ సిద్విలాస్ 142 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాలభాస్కరరావు, బెజవాడ నరేంద్రబాబులతో కలిసి శ్యామ్ సిద్విలాస్‌ను కళాశాలలో ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.



శ్యామ్ సిద్విలాస్‌ను అభినందిస్తున్న బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు

# పీఠం ఎవరికి దక్కునో?

సార్వత్రిక ఎన్నికల సమరం తుది అంకానికి చేరింది. రెండు నెలలుగా హోరాహోరీగా సాగిన ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. ఓట్ల లెక్కింపునకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మరోవైపు జిల్లాలోనే ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే పీఠం ఎవరికి దక్కుతుందో అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సర్వేపల్లి నుంచి ప్రస్తుత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తలపడగా, కోవూరు సిట్టింగ్ ఎమ్మెల్యేను రాజ్యసభ మాజీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రశాంతి రెడ్డి ఢీకొన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఫలితాలపై భారీగా బెట్టింగ్‌లు కూడా జరగడం విశేషం.

## కోవూరు కాపు ఎవరో?

**కోవూరు, జూన్ 3:** కోవూరు నియోజకవర్గ శాసనసభ స్థానానికి ఓట్ల లెక్కింపు నెల్లూరు నగర శివారుల్లోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రధాన ప్రత్యర్థులుగా పోటీలో తమ సత్తా చాటుకోనున్నారు. నెల్లూరు పార్లమెంటు స్థానానికి టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి ప్రచారంలో సత్ఫలితాల్ని సాధించినట్లు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి కడింపాటి అశోక్‌కుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థులతో కలిపి 13మంది కోవూరు బరిలో నిలిచి నామమాత్రపు పోటీనిచ్చారు. నియోజకవర్గంలో 2,67,403 ఓటర్లుండగా 324 పోలింగ్ కేంద్రాల్లో 2,11,976 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 3,268 మంది పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు 14 టేబుళ్లల్లో 24 రౌండ్లలో సాగనుంది. తుది ఫలితం వెలువడేందుకు సాయంత్రం 6గంటలు పట్టే అవకాశమున్నట్టు భావిస్తున్నారు.


వేమిరెడ్డి ప్రశాంతి (టీడీపీ)


నల్లపరెడ్డి ప్రసన్న (వైసీపీ)

## సర్వేపల్లి పట్టు చిక్కేది ఎవరికో?


సోమిరెడ్డి (టీడీపీ)


కాకాణి (వైసీపీ)

**ముత్తుకూరు, జూన్ 3 :** సార్వత్రిక ఎన్నికలలో సర్వేపల్లి నియోజకవర్గంలో గెలుపు ఎవరిదో మరికొన్ని గంటల్లో తేలనుంది. గత నెలలో జరిగిన ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గ అసెంబ్లీ బరిలో 13 మంది అభ్యర్థులు నిలిచారు. వీరిలో టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మధ్య ప్రధాన పోరు సాగింది. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ కేవలం నామమాత్రంగా బరిలో నిలిచారు. నియోజకవర్గంలో 2,32,011 ఓట్లు ఉండగా 83.88 శాతంతో 1,94,618 ఓట్లు పోలయ్యాయి. మంగళవారం జరిగే కౌంటింగ్‌లో రౌండ్‌కు 14 టేబుల్ వంతున 21 రౌండ్లు కౌంటింగ్ జరగనుంది. తొలి ఆరు రౌండ్లలో పొదలకూరు మండలం ఓట్లను లెక్కించనున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పొదలకూరు మండలంలో ఆధిక్యం లభించింది. అయితే ఈసారి ప్రభుత్వంపై వ్యతిరేకత, కాకాణి అవినీతి కారణంగా పొదలకూరులో తమకు ఎక్కువ ఓట్లు వస్తాయని సోమిరెడ్డి వర్గీయులు భావిస్తున్నారు. దీంతో తొలి ఆరు రౌండ్లలోనే సర్వేపల్లి విజయంపై ఒక అంచనాకి రావచ్చని భావిస్తున్నారు. తర్వాత నాలుగు రౌండ్లు టీపీగూడూరు మండలం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అనంతరం ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు మండలాల ఓట్లను లెక్కిస్తారు. పూర్తి ఫలితాలు సాయంత్రం 4గంటలకు తేలవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఎన్నికలు జరిగాక ఫలితాల కోసం 21 రోజులపాటు నియోజకవర్గ ప్రజలు ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు. గత రెండుసార్లు కాకాణి చేతిలో పరాజయం పాలైన చంద్రమోహన్‌రెడ్డి ఈసారైనా విజయం సాధిస్తారా.. లేదా అనే విషయం చర్చనీయాంశంగా మారింది. చేసిన అభివృద్ధితోపాటు ప్రభుత్వ వ్యతిరేకత, నిత్యం ప్రజల్లో ఉంటూ కష్టపడిన ఫలితం ఈసారి తనకు విజయాన్ని సాధించి పెడుతుందన్న ధీమాను సోమిరెడ్డి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రజా సంక్షేమ పథకాల అమలు, జగన్‌పై నమ్మకం, పదేళ్లుగా ప్రజలతో మమేకమైన తీరు తనను గెలిపిస్తుందన్న ఆశాభావంతో కాకాణి ఉన్నారు. అయితే ఎవరేమనుకున్నా తమ మనసులో ఏముందో బయటపెట్టని ఓటరు అంతిమ తీర్పును ఈవీఎంలలో ఇప్పటికే నిక్షిప్తం చేశారు. నేతల తలరాతలను మార్చే ఆ తీర్పు ఏమిటో తెలియాలంటే మరికొద్ది గంటలు ఉత్కంఠతో ఎదురుచూడాల్సిందే.!!

### బ్యాంకులు కిటకిట

**బుచ్చి:** మండలంలోని పలు బ్యాంకులు సోమవారం పింఛనుదారులతో కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో వృద్ధులు తరలివచ్చారు.

## సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ హైమారావు

**బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 3:** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బుచ్చి నగర పంచాయతీ, సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సీఐ హైమారావు మాట్లాడుతూ 144సెక్షన్, 30 పోలీస్‌యాక్టు అమల్లో వందన్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు మూసివేయాలన్నారు. 6వ తేదీ వరకు ఎటువంటి విజయోత్సవాలు, సంబరాలు చేయుటకు అనుమతి లేదన్నారు. పోలీసు ఆదేశాలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలతో పాటు రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

**పొదలకూరు:** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో పొదలకూరులో సోమవారం సాయంత్రం 5గంటల నుంచి మంగళవారం అర్ధరాత్రి 12గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి పనిలేకుండా రోడ్లపై తిరగకూడదన్నారు. అనుమానా స్పదంగా సంచరించే కొత్త వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఎవరూ ఎలాంటి మారణాయుధాలు ధరించి ఉండరాదని తెలిపారు.



## ఘనంగా సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదినం


వెంకటాచలం: సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నేతలు

**వెంకటాచలం, జూన్ 3:** మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనయుడు, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఆపార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. వేదాయపాళెంలోని సోమిరెడ్డి కార్యాలయానికి నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున వెళ్లి రాజగోపాల్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో సోమిరెడ్డి కార్యాలయంలో సందడి నెలకొంది.

**పొదలకూరు :** సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను సర్వేపల్లి తెలుగు యువత, మండల నాయులు సోమవరం ఘనంగా నిర్వహించారు. నెల్లూరులోని వేదాయపాలెం సమీపంలో సోమిరెడ్డి నివాసంలో సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**మనుబోలు :** తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి నెల్లూరులోని సోమిరెడ్డి కార్యాలయంలో రాజగోపాల్‌రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చిపాల అవినాష్ రెడ్డి, రావుల అంకయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### లోకజ్ఞానం పెంపొందించుకోవాలి

**కోవూరు, జూన్ 3:** విద్యార్థులు లోకజ్ఞానం పెంపొందించుకోవాలని ఉపాధ్యాయ నాయకుడు టి రంగారెడ్డి సూచించారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో నిర్వహించిన సృజనాత్మకత క్విజ్ పోటీల సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజనాత్మకత, నైపుణ్యత పెంపొందించుకునే అంశాలపై విద్యార్థులు దృష్టిపెట్టాలన్నారు. దినపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు వైవీ సుబ్బారావు క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బుచ్చిలో మద్యం దుకాణాల మూత

**బుచ్చిరెడ్డిపాళెం, జూన్3:** బుచ్చి పట్టణంతోపాటు మండలంలోని మద్యం దుకాణాలను సోమవారం బంద్ చేసినట్టు ఎక్సైజ్ అధికారి రేఖ తెలిపారు. తిరిగి మంగళవారం యధాతధంగా తెరుస్తారని తెలిపారు. టార్గెట్ల మేరకు సోమవారం దుకాణాలను ముందు వెనుకగా మూసేసినట్టు తెలిపారు..

# నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

# గెలుపెవరిదో!?

**● నేడు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ● నెల్లూరు సిటీ, రూరల్‌పైనే అందరి దృష్టి**



ఓట్ల లెక్కింపు కేంద్రంలో బోర్డులు

**నెల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) :** నెల్లూరులో విజయం ఎవరిది?, ఎమ్మెల్యేలుగా గెలిచేదెవరు..?, సిటీ, రూరల్‌లో ఎవరు జెండా ఎగురవేయబోతున్నారు..? ఎవరి మెజారిటీ ఎంత..? అన్న అంశాలపై జిల్లా కేంద్రంలో విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరగనున్న నేపథ్యంలో ఈ చర్చలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అందరి చూపు నెల్లూరుపైనే ఉంది. నగరంలో విస్తరించి ఉన్న రెండు నియోజకవర్గాల్లో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయన్నది రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగా మారింది. ఇక్కడ పోటీ చేస్తున్న అభ్యర్థులకున్న పాపులారిటీ దృష్ట్యా ఇక్కడి ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. మొదటి నుంచీ రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారం మాదిరిగానే ఎగ్జిట్ పోల్స్‌లో కూడా నెల్లూరు సిటీపై ఏకపక్ష తీర్పు వచ్చింది. ఇక్కడ మెజారిటీ ఎంత అన్నదానిపైనే ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. నెల్లూరు రూరల్‌లో టీడీపీ, వైసీపీ మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాయి. ఈ నేపథ్యంలో వైసీపీ రెబల్‌గా బయటకు వచ్చి టీడీపీ తరపున పోటీ చేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హవా రూరల్‌లో కొనసాగుతుందా..? హ్యాట్రిక్ కొడతారా..? అన్నది ఆసక్తిగా మారింది. ఇప్పటి వరకూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎక్కువ కాలం ఎమ్మెల్యేగా కొనసాగిన రికార్డు శ్రీధర్‌రెడ్డికి ఉంది. ఇక వైసీపీ తరపున పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి తొలిసారి రూరల్‌లో ఎమ్మెల్యేగా అడుగు వేస్తారా..? అన్నది మంగళవారం తేలిపోనుంది.

## సిటీలో భారీగా పోలింగ్

**● నారాయణ మెజార్టీపై చర్చలు**


నారాయణ(టీడీపీ)


ఖలీల్ (వైసీపీ)

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఎన్నికల పర్వం ప్రశాంతంగా సాగుతోంది. ఇక్కడ గతానికి కన్నా ఈ సారి అధికంగా పోలింగ్ నమోదైంది. 2019లో 66.37 శాతం పోలింగ్ జరగ్గా, ప్రస్తుతం అది 71.72 శాతానికి పెరిగింది. జిల్లా మొత్తం సరాసరి రెండు శాతం అధికంగా పోలింగ్ నమోదుకాగా ఒక్క నెల్లూరు సిటీలో మాత్రం ఐదు శాతానికిపైగా పెరిగింది. 2,39,497 మంది ఓటర్లకుగానూ1,71,763 మంది తమ ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. ఈ ప్రభావం ఎవరికి లాభిస్తుందన్న దానిపై రకరకాల విశ్లేషణలు జరుగుతు న్నాయి. సిటీలో మొత్తం 248 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది. ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం 18 రౌండ్లలో కౌంటింగ్‌ను పూర్తి చేయనున్నారు. జిల్లాలో మిగితా నియోజకవర్గాల కన్నా తక్కువ రౌండ్లు ఉండటంతో అధికారికంగా వెల్లడికానున్న తొలి ఫలితం నెల్లూరు సిటీది కావడం విశేషం. మధ్యాహ్నం రెండు గంటల్లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక, ఇక్కడ పోస్టల్ బ్యాలెట్లు కూడా కీలకం కానున్నాయి. 3071 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించు కున్నారు. మొదట వీటి లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుంది. నెల్లూరు సిటీలో 15 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్యే పోటీ నెలకొంది. టీడీపీ తరపున పొంగూరు నారాయణ, వైసీపీ తరపున ఎండీ ఖలీల్ అహ్మద్ పోటీ చేస్తు న్నారు. వీరిలో ఎవరు గెలిచినా నెల్లూరు సిటీ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారవుతారు.

| అభ్యర్థులు | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | పోస్టల్ బ్యాలెట్ | కౌంటింగ్ టేబుళ్లు | కౌంటింగ్ రౌండ్లు |
|---|---|---|---|---|---|
| 15 | 2,39,497 | 1,71,763 | 3071 | 14 | 18 |

## కోటంరెడ్డి హ్యాట్రిక్ కొట్టేనా?

**● రూరల్‌లో కీలకంగా పోస్టల్ బ్యాలెట్**


కోటంరెడ్డి (టీడీపీ)


ఆదాల (వైసీపీ)

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఈ దఫా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చాలా కీలకంగా మారనున్నాయి. జిల్లాలో అత్యధికంగా ఈ నియోజకవర్గంలోనే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. 5405 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదవడంతో అందరి దృష్టి రూరల్‌పైన ఉంది. ఈ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక హాల్‌ను కేటాయించారు. 2019 ఎన్నికలతో పోలిస్తే రూరల్ నియోజకవర్గంలోనూ ఈ సారి స్వల్పంగా పోలింగ్ శాతం పెరిగింది. నాడు 66.14 శాతం పోలింగ్ నమోదుకాగా ప్రస్తుతం 67.76 శాతం నమోదైంది. 2,80,888 ఓట్లకుగాను 1,90,324 ఓట్లు పోలయ్యాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు కలిసి ఉండడం ఈ నియోజకవర్గం విశిష్టత. 50 వేల ఓట్ల వరకు గ్రామీణ ప్రాంతంలో ఉండగా, మిగిలినవన్నీ నెల్లూరు నగరంలో ఉన్నాయి. దీంతో నగర వాసులు ఎవరి వైపు నిలబడితే వారినే గెలుపు వరిస్తుంది. రూరల్‌లో 285 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది. 21 రౌండ్లలో ఫలితాలను తేల్చనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకంతా కౌంటింగ్ పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రూరల్ నియోజకవర్గంలో మొత్తం 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్యనే పోటీ జరుగుతోంది. ఇప్పటికే గడిచిన రెండు ఎన్నికల్లో గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. మరో దఫా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తే ఆయన రికార్డు నెలకొల్పుతారు. అదే సమయంలో వైసీపీ తరపున నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. రూరల్ నుంచి ఆయన తొలిసారి పోటీ చేస్తున్నారు. ఆయన గెలిస్తే రూరల్ నుంచి మరో కొత్త ఎమ్మెల్యే ఎన్నికైనట్లు అవుతుంది.

| అభ్యర్థులు | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | పోస్టల్ బ్యాలెట్ | కౌంటింగ్ టేబుళ్లు | కౌంటింగ్ రౌండ్లు |
|---|---|---|---|---|---|
| 11 | 2,80,888 | 1,90,324 | 5405 | 14 | 21 |

## పోస్టల్ బ్యాలెట్ తరలింపు



**నెల్లూరు(సిటీ), జూన్ 3 :** నెల్లూరు సిటీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కూడిన డబ్బాలను పోలీసు భద్రతతో లెక్కింపు కేంద్రానికి తరలించారు. ఈ ప్రక్రియ సోమవారం సిటీ ఆర్వో వికాస్ మర్మత్ నేతృత్వంలో సాగింది. అభ్యర్థులకు చెందిన ఏజెంట్ల సమక్షంలో కార్పొరేషన్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూం నుంచి బయటకు తీసిన బ్యాలెట్ బాక్సులను ప్రత్యేక వాహనంలో పోలీసు భద్రత నడుమ ప్రియదర్శిని కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి చేర్చారు.

## కనుల పండువగా దవనోత్సవం



**నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 3 :** సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు మూడోరోజుకు చేరాయి. సోమవారం స్వామివారికి దవనోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా విశేష పూజలు, పుష్పాలంకారం అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, ఈవో జీ దుర్గయ్య పర్యవేక్షించారు.

## నారాయణ వైద్య కళాశాలకు పార్థివదేహం

**నెల్లూరు(వైద్యం), జూన్ 3 :** నారాయణ వైద్య కళాశాలకు గట్టమనేని శ్రీరాములు అనే వ్యక్తి పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు సోమవారం సమర్పించారు. ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు మండలం వినోదరాయునిపాళేనికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీరాములు ఉద్యోగ విరమణ అనంతరం నెల్లూరులోని తన కుమార్తెలు విజయలక్ష్మి, శివకుమారి వద్ద ఉంటున్నారు. ఆదివారం రాత్రి శ్రీరాములు మృతి చెందటంతో ఆయన కోరిక మేరకు పార్థివ దేహాన్ని నారాయణ వైద్య కళాశాలకు అందచేశారు. నేత్రాలను ఎల్‌వీ కంటి ఆసుపత్రికి అందజేశారు.

## 'మెడికవర్'ను సందర్శించిన రవి సన్నారెడ్డి

**నెల్లూరు(వైద్యం) :** మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సోమవారం శ్రీసిటీ నిర్వాహకుడు డాక్టర్ రవీం ద్ర సన్నారెడ్డి సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవ లను అడిగి తెలుసుకున్నారు. ఆయన్ను ఆసుపత్రి నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సెంట్రల్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, కేన్సర్ విభాగం హెడ్ డాక్టర్ బిందూరెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

## సత్యనాగేశ్వరరావుకు పరామర్శ

**నెల్లూరు (సాంస్కృతికం) :** 45వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పిట్టి సత్యనాగేశ్వరరావు కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి నారాయణ పరామర్శించారు. సత్యనాగేశ్వర రావు తల్లి పిట్టి చిన్నమ్మ ఆదివారం కన్నుమూశారు. ఆమె పొంగూరు నారాయణ, నారాయణ విద్యా సంస్థల జీఎం విజయ భాస్కర్ రెడ్డి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ పాల్గొన్నారు.

### టీడీపీ సీనియర్ నేత మృతికి సంతాపం

**ఇందుకూరుపేట :** లేబూరులో టీడీపీ సీనియర్ నాయకుడు కోవూరు మాజీ శాసనసభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మామ కట్టంరెడ్డి కోటారెడ్డి సోమవారం మృతిచెందారు. పలువురు టీడీపీ నాయకులు కోటారెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రచౌదరి, చెముకుల కృష్ణచైతన్య, మునగాల రంగారావు, పి సింధుర కృష్ణ, లెనిన్‌బాబు, బొద్దుకూరు సుధాకర్, బొద్దుకూరు సుధీర్, తదితరులు ఉన్నారు.

### భారీ అన్నసంతర్పణ

**మనుబోలు** యాచవరం అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద సోమవారం భారీ అన్న సంతర్పణ చేశారు. అంతకుముందు హనుమంతుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యనమల అంకయ్య, సుధీర్, శ్రీనువాసులు, అచ్చి వెంకటరమణయ్య, యాచవరం యువత పాల్గొన్నారు.

**ఒకరు** పథకాలన్నారు.. ప్రజా సంక్షేమం అన్నారు.. వలంటీర్లు దేవుళ్లన్నారు, కాబోయే నాయకులన్నారు.. ఒడిలో వేలు కుమ్మరించామన్నారు. అభివృద్ధే గెలిపిస్తుందని దబాయించి చెప్పారు.

**మరొకరు** మరింత సంక్షేమం మా లక్ష్యం అని ఎలుగెత్తి ప్రకటించారు. పెంచిన పింఛను లెక్కలు కళ్లముందు తళతళలాడించారు. అభివృద్ధికి అసలైన చిరునామా మేమే అన్నారు.

నిజానికీ అబద్ధానికీ నడుమ రేఖ చెరిగిపోయింది. భయమా.. భరోసానా..? ఏది పనిచేసింది? ఏ బటన్ దేన్ని నొక్కింది? వెదజల్లిన వందల కోట్లు ఏమి పలికించబోతున్నాయి?

జనం నొక్కిన బటన్ ఎవర్ని పాతాళానికి తొక్కిందో, ఎవర్ని గద్దెనెక్కించిందో అంతుపట్టక లబ్‌డబ్ గుండెలతో రోజులు గడిపేశారు. రహస్యాన్ని గుండెల్లో దాచుకున్న పెట్టెలు నేడు నోళ్లు విప్పబోతున్నాయి. నాయకులారా బహు పరాక్!

## తేలనున్న పార్టీల, అభ్యర్థుల భవితవ్యం

## ప్రధాన పార్టీల శ్రేణులతో తిరుపతిలో లాడ్జీలన్నీ ఫుల్

**టీడీపీ కూటమి అభ్యర్థులు**



వరప్రసాద్, తిరుపతి పార్లమెంట్ · నాని, చంద్రగిరి · శ్రీనివాసులు, తిరుపతి · సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి · రామకృష్ణ, వెంకటగిరి · సునీల్‌కుమార్, గూడూరు · ఆదిమూలం, సత్యవేడు · విజయశ్రీ, సూళ్లూరుపేట




**వైసీపీ అభ్యర్థులు**



గురుమూర్తి, తిరుపతి పార్లమెంట్ · మోహిత్ రెడ్డి, చంద్రగిరి · అభినయ్, తిరుపతి · మధుసూదన రెడ్డి, శ్రీకాళహస్తి · రామ్‌కుమార్ రెడ్డి, వెంకటగిరి · మురళీధర్, గూడూరు · రాజేశ్, సత్యవేడు · సంజీవయ్య, సూళ్లూరుపేట





# దేవుడా.. దేవుడా.. దేవుడా!

## ఎన్నికల ఫలితాల వెల్లడి నేడే

తిరుపతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా సాగిన సార్వత్రిక ఎన్నికల్లో విజేతలెవరో నేడు తేలిపోనుంది. మంగళవారం మధ్యాహ్నానికల్లా వెల్లడయ్యే ఓట్ల లెక్కింపు ఫలితాలు ప్రధాన పార్టీలతో పాటు ఆయా పార్టీల అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నాయి. నామినేషన్ల దాఖలు నాటి నుంచీ ఇప్పటి దాకా ప్రధాన పార్టీల నేతల్లో కనిపించిన బింకం కనుమరుగై ఆందోళన, ఆదుర్దా పెరుగుతుండగా ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో, ఏ అభ్యర్థి గెలుస్తారోనన్న ఉత్కంఠ రాజకీయ పార్టీల శ్రేణులతో సమానంగా జనంలోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది.గత నెల 13వ తేదీన జరిగిన ఎన్నికలు రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన వైసీపీ, టీడీపీలకు అత్యంత కీలకంగా పరిణమించిన నేపథ్యంలో దాని ప్రభావం జిల్లాలోనూ ప్రతిఫలించిన సంగతి తెలిసిందే. అధికార పార్టీ అభ్యర్థులు, టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించేందుకు సర్వ శక్తులూ ఒడ్డారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమవైపే నిలిచారని అధికార పార్టీ అభ్యర్థులు గట్టిగా నమ్ముతుండగా ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు ఆకర్షణీయమైన మేనిఫెస్టో కారణంగా మెజారిటీ ప్రజలు తమకు మద్దతిచ్చారని టీడీపీ కూటమి అభ్యర్థులు బలంగా విశ్వసిస్తున్నారు. అయితే ఇరు పక్షాల ప్రచార హోరు, పంపకాల జోరు, వ్యూహాల తీరు చూశాక ఎన్నికలు పోటాపోటీగా జరిగాయనేది తేటతెల్లమైంది. దీంతో ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తుందో, ఏ అభ్యర్థి గట్టెక్కుతారో ముందుగా అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. పైకి వైసీపీ, టీడీపీ కూటమి అభ్యర్థులు బింకంగా గెలుపు తమదేనని చెబుతున్నప్పటికీ ఇరు పక్షాల్లోనూ ఫలితాలపై ఆందోళన, ఆదుర్దా వ్యక్తమవుతోంది. ఇరు పార్టీల అభ్యర్థులూ శక్తికి మించి ఎన్నికల్లో ఖర్చు చేశారు. పోటీ తీవ్రత కారణంగా పల్లె నుంచీ పట్టణాల్లోని వార్డుల దాకా వర్గాలు నిట్టనిలువునా చీలిపోయాయి. ఆ మేరకు ఉద్రిక్తతలూ పెరిగాయి. ప్రత్యర్థి పక్షం గెలిస్తే తాము కక్ష సాధింపు చర్యలకు గురవుతామన్న భయం, ఆందోళనా ఇరువైపులా వెంటాడుతోంది. దీనికి తోడు చాలామంది అభ్యర్థులకు ఈ ఎన్నికలు చావోరేవో అన్నట్లు మారింది. ఓడితే తదుపరి ఎన్నికల నాటికి రాజకీయంగా తమ ఉనికి వుంటుందో లేదోనన్న అభద్రత నెలకొంది. వీటన్నింటి కారణంగా ఓట్ల లెక్కింపు ఫలితాలు రెండు పక్షాల అభ్యర్థుల్లోనూ టెన్షన్ పెంచుతున్నాయ్.

వెంకటగిరిలో మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి కుమారుడు రామ్‌కుమార్ వైసీపీ తరపున తొలి ఎన్నికలు ఎదుర్కొంటున్నారు. ఫలితాలపైనే ఆయన రాజకీయ భవితవ్యం ఆధారపడి వుంది. ఒకవేళ ఓడితే వైసీపీలో వర్గ రాజకీయాల కారణంగా నియోజకవర్గంపై ఆయన పెత్తనం కొనసాగకపోవచ్చు. అలాగే సత్యవేడులో వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేశ్ ఓడితే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రతిష్ఠ దెబ్బతినే అవకాశముంది. ధిక్కరించి టీడీపీలో చేరి పోటీ చేసిన కోనేటి ఆదిమూలం మంత్రి ఆధిపత్యాన్ని దెబ్బతీసినట్టు అవుతుంది. అదే సమయంలో సత్యవేడులో రాజేశ్ భవిష్యత్తు అనిశ్చితంగా మారనుంది. తిరుపతిలో ప్రధాన పార్టీల్లో ఏ అభ్యర్థి ఓడినా వారి భవితవ్యం ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి. చంద్రగిరిలో కూడా ఓడిన వారి ప్రాబల్యం, ఆధిపత్యం తగ్గుముఖం పట్టే అవకాశముంది. సూళ్ళూరుపేటలో సైతం ఓడిన అభ్యర్థి రాజకీయ భవితవ్యం ఇబ్బందికరంగా మారనుంది. అధికారంలోకి వచ్చే పార్టీని బట్టి జిల్లాలో సమీకరణలు సమూలంగా మారిపోనున్నాయి.

### జయాపజయాలపైనే అభ్యర్థుల భవితవ్యాలు

### తిరుపతికి తరలిన ప్రధాన పార్టీల శ్రేణులు

ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ప్రధాన పార్టీల శ్రేణులు తిరుపతికి చేరుకున్నాయి. వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ తదితర ప్రధాన పార్టీల నాయకులు ఒక రోజు ముందుగానే తిరుపతికి చేరుకున్నారు. అభ్యర్థులు సైతం జనరల్ ఏజంట్లను, కౌంటింగ్ ఏజంట్లను వెంటబెట్టుకుని సోమవారం సాయంత్రానికే తిరుపతి చేరుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4గంటలకే ఏజంట్లు కౌంటింగ్ కేంద్రాలకు చేరాలి కాబట్టి ముందస్తుగా వారు తిరుపతి వచ్చారు. మిగిలిన గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, పార్టీల సానుభూతిపరులు మంగళవారం తిరుపతి తిరుపతికి తరలిరానున్నారు. చాలామంది ముందస్తుగానే గదులు బుక్ చేసుకున్నారు. పగలంతా ఎండ, ఉక్కపోత భరించలేక గదుల్లో విశ్రాంతి తీసుకుని తుది ఫలితాలు వెల్లడయ్యే సమయానికి కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకునేలా పలువురు ప్లాన్ చేసుకున్నారు. దానికి తోడు పోలీసు కఠిన ఆంక్షల వల్ల కూడా కౌంటింగ్ కేంద్రాలకు సమీపంగా వుండలేని పరిస్థితులు నెలకొన్నాయి. అది కూడా గదులు తీసుకునేందుకు కారణమవుతోంది. దీంతో నగరంలోని లాడ్జీలన్నీ దాదాపు ఫుల్ అయిపోయాయి.

### జనంలోనూ తీవ్ర ఉత్కంఠ

జిల్లావ్యాప్తంగా సామాన్య జనంలో కూడా ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఏ పార్టీ విజయం సాధిస్తుందో, జిల్లాలో నియోజకవర్గాల వారీ ఏ అభ్యర్థులు గెలుస్తారోనన్న దానికోసం ఆసక్తిగా వేచి చూస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే తమకు కలిగే లబ్ధి ఏమిటన్నది అంచనా వేసుకుంటున్నారు. తిరుపతి వంటి చోట్ల అయితే ఫలితాలను బట్టి శాంతి భద్రతలు, భూ దందాలు, దౌర్జన్యాలు వంటివి అదుపులోకి వస్తాయా రావా అన్నదానిపై చర్చ నడుస్తోంది. శ్రీకాళహస్తిలో కూడా ఇవే అంశాలపై జనంలో చర్చ సాగుతోంది. చంద్రగిరిలో ఇటీవలి ఘర్షణల నేపథ్యంలో ఫలితాలను బట్టి ఏం జరుగుతుందోనన్న ఆందోళన జనంలో కనిపిస్తోంది. వెంకటగిరిలో రామ్‌కుమార్, సూళ్ళూరుపేటలో నెలవల విజయశ్రీ, చంద్రగిరిలో మోహిత్ రెడ్డి, తిరుపతిలో అభినయ్ వంటి రాజకీయ కుటుంబాల వారసుల భవితవ్యంపైనా జనంలో ఆసక్తి నెలకొంటోంది. శ్రీకాళహస్తిలో పాత ప్రత్యర్థుల్లో ఎవరు గెలుస్తారన్నదానిపైనా జనం దృష్టి సారిస్తున్నారు. వైసీపీ అధిష్ఠానంపై తిరుగుబాటు చేసిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ తదితరుల ఫలితాల గురించి జనం ప్రత్యేకమైన ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలు చేసిన ప్రయోగాలు ఫలిస్తాయా లేక వికటిస్తాయా అన్నదానిపైనా అటు రాజకీయ వర్గాల్లోనూ ఇటు జనంలోనూ ఆసక్తి వ్యక్తమవుతోంది. వీటన్నింటి కోసం నేటి ఓట్ల లెక్కింపు ఫలితాల కోసం అన్ని వర్గాలూ ఉత్కంఠగా వేచి చూస్తున్నాయి.

## ఉదయం 8 గంటలనుంచే కౌంటింగ్

**● సాయంత్రం 4గంటలకల్లా పూర్తి ఫలితాలు : కలెక్టర్**



కౌంటింగ్ హాళ్లలో పూర్తయిన ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించి, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఉదయం ఎనిమిది గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభించి, సాయంత్రం నాలుగు గంటలకల్లా పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు.

**16 కౌంటింగ్ హాళ్లు**

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు తిరుపతి పార్లమెంటుకు సంబంధించి పోలైన ఓట్లను లెక్కించడానికి 16 కౌంటింగ్ హాళ్లను సిద్ధం చేశారు.

**బరిలో 156 మంది**

ఓ పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 156మంది ఎన్నికల బరిలో ఉన్నారు. గూడూరుకు 14 మంది, సూళ్లూరుపేటకు తొమ్మిదిమంది, వెంకటగిరికి 10మంది, చంద్రగిరికి 24మంది, తిరుపతికి 46మంది, శ్రీకాళహస్తికి 15, సత్యవేడుకు 15మంది పోటీ చేశారు. పార్లమెంటుకు వచ్చేసరికి 23మంది బరిలో ఉన్నారు.

**కౌంటింగ్ ప్రక్రియ ఇలా..**

ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. చంద్రగిరికి మాత్రం 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. పార్లమెంటుకు కూడా ఇదే తరహాలో ఉంటాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా టేబులుకో ఏఆర్వో స్థాయి అధికారిని నియమించారు. నలుగురు సిబ్బంది ఓట్ల లెక్కింపులో పాల్గొంటారు. దాదాపు 250 టేబుళ్లకు 2వేల మంది సిబ్బంది ఉంటారు. ఉదయం ఏడు గంటలకు అబ్జర్వర్లు, అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూమ్ తెరుస్తారు. ఎనిమిది గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. 8.30 గంటలకు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల గణన ప్రారంభం కానుంది. అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఓట్ల లెక్కింపు చేపడతారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈవీఎంతోపాటు పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమాంతరంగా సాగుతుంది.

**20 నిమిషాలకో రౌండ్ ఫలితం**

**● తొలి ఫలితం సత్యవేడు.. చివరిది చంద్రగిరి**

ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యాక తొలి రౌండ్ మాత్రం అరగంటపాటు ఉంటుంది. తర్వాత ప్రతి 20 నిమిషాలకో రౌండ్ ఫలితం వెలువడనుంది. సత్యవేడు, తిరుపతి, చంద్రగిరి 20 రౌండ్లు చొప్పున.. వెంకటగిరి, సూళ్లూరుపేట 22రౌండ్లు, గూడూరు, శ్రీకాళహస్తి 21 రౌండ్లలో ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఈ లెక్కన మొదట సత్యవేడు, ఆ తర్వాత శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట ఫలితాలు వెల్లడవుతాయి. మధ్యాహ్నం మూడు గంటలకల్లా ఈ ఐదు నియోజవర్గాల్లో ఫలితాలు పూర్తిస్థాయిలో వెలువడనున్నాయి.తిరుపతిలో అభ్యర్థులు 46మంది బరిలో ఉండటం.. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 4,776ఓట్లు పోలైన నేపథ్యంలో కాస్త ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. చంద్రగిరికి అత్యధికంగా పోలింగ్ కేంద్రాలు ఉండటం... పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సంఖ్య 5వేలు దాటడంతో సాయంత్రం నాలుగు గంటల సమయానికి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**కీలకం కానున్న పోస్టల్‌బ్యాలెట్**

ఫలితాల్లో పోస్టల్ బ్యాలెట్లు కీలకం కానున్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఈసారి 90శాతం మంది ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏడు నియోజకవర్గాలకు కలిపి 23వేల ఓట్లు నమోదయ్యాయి.తిరుపతి పార్లమెంటకు వచ్చేసరికి 19,503మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**మొరాయిస్తే వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కిస్తారు**

ఈవీఎం కంట్రోల్ యూనిట్ల బ్యాటరీలు పనిచేయకున్నా, సాంకేతిక సమస్యలతో మొరాయించినా పక్కన పెట్టేస్తారు. ఈసీ అనుమతితో మొరాయించిన వాటికి సంబంధించిన వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కిస్తారు.

## తిరుపతంతా పోలీసులమయం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 3: కౌంటింగ్ నేపథ్యంలో తిరుపతిలో ఎటుచూసినా పోలీసులు మోహరించి ఉన్నారు. సాయుధ బలగాలతోపాటు వజ్ర, ఫాల్కన్ వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. కౌంటింగ్ కేంద్రం చుట్టూ 25 చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ప్రతి చెక్ పోస్టు వద్ద సీఐ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆయనతోపాటు ఇద్దరు ఎస్‌ఐలు, 20 మంది పోలీసులు ఉంటారు. అత్యంత సమస్యాత్మక నియోకజవర్గాలుగా గుర్తించిన తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, గూడూరులోని దాదాపు 135 గ్రామాల్లో సాయుధ బలగాలను మోహరించారు. ఘర్షణలు జరిగితే 10, 20 నిమిషాల వ్యవధిలో ఘటనా ప్రాంతానికి చేరుకునేలా మొబైల్ పార్టీలు, కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వు బలగాలు ఎస్పీ హర్షవర్ధనరాజు ఏర్పాటు చేశారు.

**22 బాంబు డిస్పోజల్ టీమ్‌లు**

కౌంటింగ్ కేంద్రం బయట, లోపల 22 బాంబు డిస్పోజల్ టీమ్‌లు ఏర్పాటు చేశారు.గేటు 2 వద్ద మూడు డోర్ ఫ్రేములు, వర్సిటీలోపల 10 డోర్ ఫ్రేములు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ నిశితంగా, క్షుణ్ణంగా తనిఖీ చేశాకే లోనికి పంపుతారు.

**పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద బందోబస్తు**

ప్రధాన పార్టీల కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి అభ్యర్థికీ ఓ రిజర్వు సీఐ, నలుగురు పోలీసు సిబ్బందిని షాడో పార్టీలుగా నియమించారు.పార్టీ కార్యాలయాల వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు బలగాలను నియమించారు.

**అల్లర్లు సృష్టిస్తే జైలుకే**

అల్లర్లు సృష్టించే వారిపై రౌడీషీట్ తెరుస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తిస్తే వెంటనే అరెస్టు చేసి, జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఇప్పటికే దాదాపు 57 మందిపై కొత్తగా రౌడీషీట్లు ఓపెన్ చేశామని తెలిపారు. 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు కానీ ఉల్లంఘిస్తే మాత్రం జైలుకు పంపుతామని, బెయిలు రావడం కష్టమవుతుందని చెప్పారు.

### అల్లర్లు, విధ్వంసాలు జరిగితే

**వాట్సాప్ నెంబరు 80999 99977కు సమాచారం ఇవ్వండి**

ఎక్కడైనా అల్లర్లు, విధ్వంసాలు, గొడవలు, హింసాత్మక ఘటనలు జరిగితే వెంటనే పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. సంబంధిత ప్రాంతాలకు ఆర్మ్‌డ్ బలగాలు, స్ట్రైకింగ్ ఫోర్సు 10, 20 నిమిషాల వ్యవధిలో చేరుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## నిమ్మ లూజు బస్తా ధర రూ.8వేలు



గూడూరు అర్బన్, జూన్ 3: గూడూరు నిమ్మ మార్కెట్‌లో సోమవారం నిమ్మ ధర అదరకొట్టింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. దీంతోపాటు బుధవారం నాడు సాధారణ సెలవు. ఈక్రమంలో రెండు రోజులు మార్కెట్ మూతపడనుండడంతో ధరలకు రెక్కలొచ్చాయి. నిమ్మకాయలు కిలో గరిష్ఠంగా రూ.100 తాకింది. ఈశాన్య రుతుపవనాల ప్రవేశంలో నిమ్మధరలు తగ్గుముఖం పడతాయన్న క్రమంలో వరసగా రెండు రోజుల సెలవుల పుణ్యమా అని సోమవారం నిమ్మకాయల ధరలకు ఊపిరిలూదింది. దీంతో నిమ్మ రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే పాశిం జన్మదినం



గూడురు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 3: మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయలో సోమవారం నాయకులు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలో టీడీపీ బలోపేతానికి సునీల్‌కుమార్ ఎంతో కృషి చేశారన్నారు. గతంలో ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎన్.భాస్కర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, వి.శివకుమార్, డి.రాఘవరెడ్డి, నరసింహులు, శ్రీధర్, జి.లీలావతి, భారతి, కల్పన, కోటేశ్వరరావు, రమణయ్య, జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చిట్టమూరు:** గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం జన్మదిన వేడుకలు సోమవారం చిట్టమూరులో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. ఎం.జనార్ధనరెడ్డి, బి.హరికృష్ణారెడ్డి, ఎన్.రాజేష్ రెడ్డి, పి.శ్రీనివాసులు, కస్తూరయ్య, చిన్నారావు, చెంచురామయ్య ఆచారి, ముత్తు, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం... రాములోరి కల్యాణం



భక్తులకు తాళిబొట్టు చూపుతున్న వేదపండితులు

కోట, జూన్ 3: మండలంలోని గూడలి అరుంధతీయవాడలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో బలరామిరెడ్డి, రుక్మిణమ్మ దంపతులు ఉయభకర్తలుగా గ్రామస్తుల సహకారంతో కల్యాణతంతు నిర్వహించారు. మొదట శ్రీరాముడు, సీతమ్మ శాంతి కల్యాణాన్ని శాస్త్రోత్తంగా జరిపించారు. వేదపండితుడు అనంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని కళ్లకుకట్టినట్లుగా చేసి చూపించారు. గ్రామస్తులు స్వామిఅమ్మవార్లకు తలంబ్రాలను పోటాపోటీగా చల్లారు. అనంతరం ఆంజనేయస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాగార్జున, బుల్లయ్య, రాజనాల, రాఘవులు, వాసయ్య, మురళీ తదితరులు ఉన్నారు.

## మద్యం విక్రేతల అరెస్టు



కోట, జూన్ 3: పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో సోమవారం మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని సెబ్ అధికారులు అరెస్టు చేశారు. బజారుసెంటర్‌లో డ్రైడే ఉన్నప్పటికీ మద్యం విక్రయిస్తున్న గుర్రం పెంచలయ్య, ఈదూరు వెంకట కృష్ణయ్యను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు వాకాడు సెబ్ అధికారులు తెలిపారు.

# మద్యానికి మినహాయింపా...?

### టార్గెట్ పూర్తయ్యేవరకు షాపులు తెరచి ఉంచాలన్న ఆదేశాలు

తడ, జూన్ 3: కౌంటింగ్ వేళ అన్ని ముందస్తు చర్యలు తీసుకున్న ఎన్నికల కమిషన్ మద్యం విక్రయాలపే గాలి కొదిలేసింది. కౌంటింగ్‌కు కొన్ని గంటల ముందు వరకు విచ్చలవిడిగా విక్రయిస్తున్నా చర్యలు తీసుకోలేకపోయింది. వాస్తవంగా పోలింగ్‌కు 48 గంటల ముందు మద్యం షాపులను మూసివేస్తారు. అలాగే కౌంటింగ్‌కు 24 గంటల ముందు మూసివేసి తరువాతి రోజు తిరిగి షాపులను తెరుస్తారు. అయితే ఈ దఫా పోలింగ్‌కు 48 గంటలకు ముందు షాపులను మూసివేసిన అధికారులు కౌంటింగ్ వచ్చేసరికి ముందురోజు విచ్చలవిడిగా అమ్మకాలు సాగించారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు షాపులన్నీ మందుబాబులతో కిటకిటలాడాయి. వాస్తవంగా ఎన్నికల కమిషన్ మద్యం విక్రయాలపై కఠినమైన నిబంధనలను అమలు చేస్తుంది. కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షించి మద్యం తాగలేదని నిర్ధారించుకున్నాకే కేంద్రాల్లోకి అనుమతించే నిబంధన పెట్టింది. అయితే ముందురోజు రాత్రి మద్యం తాగి ఉన్నా బ్రీత్ ఎనలైజర్ ద్వారా నిర్ధారణ అవుతుంది. తద్వారా అతను కౌంటింగ్ ఏజెంట్‌గా ఉండేందుకు అనర్హుడవుతాడు. ఇప్పటికే పలుచోట్ల పోలింగ్ తరువాత హింసాత్మక ఘటనలు జరిగాయి. ఆదివారం సైతం సూళ్లూరుపేటలో కొందరు పార్టీ కార్యకర్తల మధ్య కొట్లాట జరిగింది. ఈ తరుణంలో మద్యం షాపులు ఇలా తెరచి ఉండటం



సూళ్లూరుపేటలో మద్యం దుకాణం వద్ద రద్దీ

శాంతి భద్రతల సమస్యేకదా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. మద్యం షాపులను సోమవారం సాయంత్రం వరకు నిర్వహించడం విమర్శలకు తావిచ్చింది.

**టార్గెట్ పూర్తయ్యే వరకు...**

ఇలా మద్యంషాపులు తెరచి ఉంచడంపై ఓజిలి మద్యం డిపో ఎస్‌ఐ తిరుమలేష్‌రావును వివరణ కోరగా తమకు ఇచ్చిన టార్గెట్ పూర్తికాలేదని, అది పూర్తైన వెంటనే షాపులు మూసివేయాలన్న ఆదేశాలు ఉన్నాయని ఆయన అన్నారు. తద్వారా సాయంత్రం వరకు ఆ షాపులు తెరుచుకునేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారన్నారు.

# తిరుపతికి తరలి వెళ్లిన నాయకులు

**● కౌంటింగ్‌తో ఉత్కంఠ**

గూడూరు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తిరుపతిలోని పద్మావతి వర్సిటీ ఆవరణలో మంగళవారం ఓట్లు లెక్కింపు ప్రక్రియ జరగనుండడంతో పట్టణంలోని ప్రధాన పార్టీల నాయకులు సోమవారం వాహనాల్లో తిరుపతికి తరలివెళ్లారు. గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 4న మంగళవారం ఫలితాలను వెల్లడించనున్నారు. ఇప్పటికే ఎన్నికలు జరిగిన నాటి నుంచి ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఫలితాల కోసం ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు. గూడూరు నియోజకవర్గానికి సంబంధించి 294 పోలింగ్‌బూత్‌లు ఉండగా, రౌండ్‌కు 14 టేబుళ్ల లెక్కన 21 రౌండ్లు లెక్కించనున్నారు. కౌటింగ్‌లో పాల్గొనే వివిధ పార్టీల ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముందుగానే తిరుపతికి బయలుదేరి వెళ్లారు. సర్వేల ఆధారంగా ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థులు గెలుపుపై ఎవరు ధీమాలో వారు ఉన్నారు. మంగళవారం విజయం ఎవరిని వరిస్తుందో తేలిపోనుంది.

**చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు...**

**చిల్లకూరు:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం కౌటింగ్ జరగనున్న నేపథ్యంలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని గుంపులుగా ఉండకూడదన్నారు. బాణసంచా పేల్చడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టింగులు పెట్ట కూడదన్నారు.

**పెళ్లకూరు:** సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై మండలంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నేడు తేలనున్న ఫలితాల కోసం ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. మండలంలో 36 పోలింగ్ బూత్‌లలో 27,070 ఓట్లకు గాను 21,197 పోలైనాయి. మండలంలో 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీకి 1,980 ఓట్ల ఆధిక్యం రాగా, 2019లో ఎన్నికల్లో వైసీపీకి 8,676 ఓట్ల మెజార్టీ వచ్చింది.

## టీడీపీ అభ్యర్థికి భద్రత పెంపు



కురుగొండ్ల రామకృష్ణను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

వెంకటగిరి, జూన్ 3: వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణకు పోలీసు భద్రతను పెంచారు. సోమవారం ఆయన ఇంటివద్ద పది మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఆయన బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. కాగా కురుగొండ్ల రామకృష్ణ సోమవారం ఉదయం పెంచలకోన నృసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆయన తిరుపతికి బయలుదేరి వెళ్లారు. మంగళవారం కౌటింగ్ ప్రక్రియలో పాల్గొంటారు.

# కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

వెంకటగిరి, జూన్ 3: కౌటింగ్ సమయంలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల కుమార్తె లక్ష్మీసాయిప్రియ అన్నారు. సోమవారం ఆమె తన నివాసంలో కౌటింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. కౌటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె వారికి దిశానిర్దేశం చేశారు. కౌటింగ్ ఏజెంట్లు మంగళవారం ఉదయం 5.30 గంటలకల్లా హాల్‌లోకి ప్రవేశించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డును విధిగా తీసుకుని వెళ్లాలన్నారు. కౌటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ కేంద్రం వదిలిపెట్టి బయటకు రావద్దన్నారు. పూర్తి స్థాయి ఫలితాలు వెలువడే వరకు అశ్రద్ధ వహించవద్దని ఆమె సూచించారు. కౌటింగ్ పూర్తయ్యే వరకు ఏజెంట్లు కేంద్రంలోనే ఉండాలన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు పి.రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద నాయుడు, నాయకులు గంగాధర్, ఏ.సత్యనారాయణ, జి.మురళీ, పి.విశ్వనాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఏజెంట్లకు దిశానిర్దేశం చేస్తున్న లక్ష్మీసాయిప్రియ

### పింఛన్ కోసం వెళ్లి...

## వడదెబ్బతో వృద్ధుడి మృతి

పుత్తూరు అర్బన్, జూన్ 3: పింఛన్ కోసం వెళ్లిన వృద్ధుడు ఎండవేడిమి తాళలేక మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. కుటుంబసభ్యుల కథనం మేరకు.... పుత్తూరు పట్టణ పరిధిలోని ఆరేటమ్మ ఎస్టీ కాలనీకి చెందిన కే.కృష్ణప్ప వృద్ధాప్య పింఛన్ కోసం కల్యాణపురం సచివాలయానికి ఆదివారం వెళ్లాడు. క్యూలైన్‌లో నిలబడి ఉండగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. సచివాలయ సిబ్బంది సమాచారంతో కుటుంబసభ్యులు కిష్టప్పను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. రుయాలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.



కిష్టప్ప(ఫైల్‌ఫొటో)

## క్లబ్‌ఫుట్ బాధితులను తక్షణ వైద్యంతో రక్షణ

తిరుపతి(వైద్యం), జూన్ 3: పుట్టుకతో వంకర కలిగిన పాదం(క్లబ్‌ఫుట్) వ్యాధిన పడిన శిశువులకు తక్షణమే వైద్యం అందించడం వలన వైకల్యం బారిన పడకుండా రక్షించవచ్చని డీఎంహెచ్‌వో శ్రీహరి తెలిపారు. ప్రపంచ క్లబ్‌ఫుట్ దినం సందర్భంగా రుయా చిన్నపిల్లల విభాగంలో సూపరింటెండెంట్ రవిప్రభుతో కలిసి ఆయన సోమవారం క్లబ్‌ఫుట్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్లబ్‌ఫుట్ పుట్టుకతోనే వచ్చే వ్యాధి అని, దీనిబారిన పడిన శిశువుల పాదాలు మెలితిప్పి ఉండటంతో నడవడం కష్టతరంగా మారుతుందన్నారు. పుట్టిన వెంటనే చిన్నారులకు వైద్యం అందిస్తే అంగవైకల్యం బారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య విభాగాధిపతులు మనోహర్, సురేష్, డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పరిషత్‌కు పంపుతారనే వార్తలు వదంతులే

**● నటి సుమలత**



కుటుంబ సభ్యులతో సుమలత

తిరుమల, జూన్3 (ఆంధ్రజ్యోతి): తనను బీజేపీ పరిషత్‌కు పంపాలని చూస్తుందనే వార్తలు వదంతులేనని నటి సుమలత వివరణ ఇచ్చారు. ఆ సీటు వేరే వాళ్లకు కూడా ప్రకటించారని తెలిపారు. ప్రస్తుతం తాను స్టేట్ పాలిటిక్స్ వైపు చూడటం లేదన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ సీటు ఆశిస్తున్నారా అనే ప్రశ్నకు చూద్దామని బదులిచ్చారు. కేంద్రంలో బీజేపీనే వస్తుందని ఎగ్జిట్ పోల్స్ చెప్పాయని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. మోదీ 0.3ని చూస్తామన్నారు. తన కుమారుడు హీరో అభిషేక్ అంబరీష్, కోడలు, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

## చల్లబడిన వాతావరణం

గూడూరు అర్బన్, జూన్ 3: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో పట్టణంలో సోమవారం వాతావరణం చల్లబడింది. గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీల వరకు నమోదు కావడంతో సూర్యప్రతాపానికి ప్రజలు అల్లాడిపోయారు. ఉక్కపోతను తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో రుతుపవనాలు కారణంగా వాతావరణం చల్లబడడంతో సేదతీరారు.

## 6న సూళ్లూరుపేటలో జాబ్‌మేళా

సూళ్లూరుపేట, జూన్ 3: సూళ్లూరుపేటలోని వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న జాబ్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బి శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జేకేసీ, అవంతి లెదర్ పరిశ్రమల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. బీఎస్సీ, బీకాం పూర్తి చేసిన యువతి, యువకులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

## తహసీల్దారు కార్యాలయం వద్ద పడవ దహనం



కాలి బూడిదైన పడవ

తడ, జూన్ 3: తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న పడవను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. తుఫాన్ అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునే నిమిత్తం అధికారులు ఎనిదేళ్ల క్రితం ఫైబర్ పడవను కొనుగోలు తహసీల్దారు కార్యాలయం వద్ద ఉంచారు. అయితే ఆదివారం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆ పడవకు నిప్పు పెట్టినట్లుగా తెలుస్తోంది. దీంతో ఆ పడవ పూర్తిగా దహనమైంది. విషయం తెలుసుకున్న తహసీల్దారు ఇక్బాల్ ప్రమాదాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తడలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తి ఈ పడవకు నిప్పు అంటించి ఉంటాడని కొందరు భావిస్తున్నారు.

## బాలికపై అత్యాచారయత్నం

గూడూరు అర్బన్, జూన్ 3: గూడూరులో ఓ బాలికపై పట్టణానికే చెందిన ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు... బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో యువకుడు అత్యాచారానికి ప్రయత్నించడంతో బిగ్గరగా కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వాళ్లు ఆ యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు.

### అగ్రిలో డిప్లొమా కోర్సులకు

## ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, జూన్ 3: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలో నిర్వహించే వ్యవసాయ డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రమణ తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో ప్రవేశాలు కల్పించే ఈ కోర్సులకు ఈనెల ఒకటో తేదీనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఇదేనెల 20వ తేదీవరకు గడువుందని చెప్పారు. ఇంటర్ ఫెయిలైన వారు కూడా దరఖాస్తు చేయవచ్చని, 2024 ఆగస్టు 31వ తేదీనాటికి 15-22 ఏళ్ల మధ్య వయసున్నవారు అర్హులని తెలిపారు. గ్రామీణ, మున్సిపల్ పాఠశాలల్లో చదివిన వారికి 75:25 నిష్పత్తిలో సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్‌ని సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తదితరాలకు 0877-2249909, 96181 67187 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని సూచించారు.

# హడావుడిగా అక్రమ నియామకాలు

### ముక్కంటి ఆలయంలో మరో వివాదాస్పద చర్య

శ్రీకాళహస్తి, జూన్ 3: ముక్కంటి ఆలయంలో 21మందికి హడావుడిగా అక్రమ నియామకాలు కల్పించేందుకు కుట్రలు చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల కొద్ది నెలల క్రితం ముక్కంటి ఆలయంలో కొందరు ఒప్పంద ఉద్యోగులను రహస్యంగా నియమించడంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వ్యక్తమయ్యాయి. భారీగా నగదు వసూలు చేసి ఒప్పంద ఉద్యోగులను నియమించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే అదే పంథాను సోమవారం మళ్లీ ఆలయ అధికారులు అనుసరించినట్లు పెద్దఎత్తున విమర్శలు చెలరేగాయి. వైసీపీ నాయకులు, ఆలయంలోకి కొందరు అధికారులు ఇటీవల కుమ్మక్కై మరో 21మందిని నియమించేందుకు కొద్దిరోజులుగా మంతనాలు సాగించినట్లు తెలిసింది. వారి వద్ద నుంచి ముడుపులు కూడా స్వీకరించినట్లు సమాచారం. ప్రస్తుతం ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నప్పటికీ వారిని ఆఘమేఘాలపై ఉద్యోగులుగా నియమించేందుకు సిద్ధమైపోయారు. తెరచాటు తతంగమంతా పూర్తి చేసుకున్నారు. 21మంది జాబితాతో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి ఒక ఏఈవో స్థాయి అధికారి నియామక ఫైల్‌ను సిద్ధం చేసుకున్నారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడేలోగా నియామకం పూర్తి చేసేందుకు పథకం వేశారు. అదే ప్రకారం ఏఈవో ఫైల్‌తో విజయవాడకు చేరుకున్నారు. ఈ గూడుపుఠాని ఒకరి నుంచి ఒకరికి పాకిపోయింది. విజయవాడలోని దేవదాయశాఖ ఉన్నతాధికారులను కోడ్ సమయంలో ఎలా నియామకాలు చేస్తారంటూ కొందరు ప్రశ్నించారు. దీంతో చివరి నిమిషంలో అక్రమ నియామకాల జాబితా బయటకు పొక్కకుండా అడ్డుకట్టపడింది.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు

తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది.